

కాటేస్తున్న కల్తీ..

ఏటా కల్తీ, నాణ్యతలేని విత్తనాలు కొనుగోలు చేసి రైతులు అప్పుల్లో కూరుకుపోతున్నారు.

వివరాలు 8లో ▸



ప్రభుత్వం చేసింది శూన్యం

తెలంగాణ ప్రభుత్వం క్రీడాకారులకు చేసిందేమీ లేదని ఆర్‌ఎస్ ప్రవీణ్ కుమార్ అన్నారు.

వివరాలు 10లో ▸

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం 42.4 /28.1

రోజంతా ఎండతీవ్రత అధికంగా ఉంటుంది. వడగాలులు వీచే అవకాశం ఉంది. ఉక్కపోత తప్పదు.

న్యూస్‌రీల్

ఈ-శ్రామ్‌లో పేర్లు నమోదు చేసుకోవాలి



గట్టు: ఈ - శ్రామ్‌లో కార్మికులు, కర్షకులు తమ పేర్లు నమోదు చేసుకోవాలని సర్పంచు ధనలక్ష్మీ కోరారు. ఆదివారం గట్టు గ్రామ పంచాయతీలో ఈ-శ్రామ్ బీమా పథకం నమోదు కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. ఈ బీమా పథకంలో ఉపాధి, కూలీలు, అంగన్‌వాడీ టీచర్లు, మధ్యాహ్న భోజనం పథకం వంట ఏజెన్సీ వారితో పాటుగా 19 ఏళ్ల నుంచి 59 ఏళ్ల లోపు ఉన్న వారు తప్పనిసరిగా చేరాలని కోరారు. కార్యక్రమంలో పంచాయతీ కోఆప్షన్ సభ్యుడు సత్యనారాయణ, ఈశ్రామ్ బృందం సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

పాలమూరు మీదుగా సమ్మర్ స్పెషల్ రైలు

స్టేషన్ మహబూబ్‌నగర్: గోరక్‌పూర్- మహబూబ్‌నగర్- గోరక్‌పూర్ సమ్మర్ స్పెషల్ రైలు (05303/05304)ను నడుపనున్నట్లు రైల్వే అధికారులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. గోరక్‌పూర్- మహబూబ్‌నగర్ రైలు (05303) ఈ నెల 13 నుంచి వచ్చేనెల 24 వరకు ఏడు ట్రిపులు నడుపుతామన్నారు. ఈ రైలు గోరక్‌పూర్ నుంచి ప్రతి శనివారం ఉదయం 8.30 గంటలకు బయలుదేరి ఖలీల్‌బాద్, బస్తి, గొండ, బరబన్‌కిజన్, ఐష్‌బాగ్, కాన్పూర్ సెంట్రల్, ఒరాయ్, విరంగాలక్ష్మిబాయి జంక్షన్, భోపాల్, ఇతర్‌సి, నాగ్‌పూర్, బల్లార్‌షా, సిర్పూర్‌కాగజ్‌నగర్, కాజీపేట జంక్షన్, మౌల అలీగేట్ క్యాబిన్, మల్కాజ్‌గిరి, కాచిగూడ, షాద్‌నగర్, జడ్చర్ల మీదుగా ఆదివారం రాత్రి 7.30 గంటలకు మహబూబ్‌నగర్‌కు చేరుకుంటుందని తెలిపారు. మహబూబ్‌నగర్- గోరక్‌పూర్ రైలు (05304) తిరుగు ప్రయాణంలో మహబూబ్‌నగర్ స్టేషన్ నుంచి సోమవారం నుంచి వచ్చే నెల 26 వరకు ప్రతి సోమవారం సాయంత్రం 6 గంటలకు బయలుదేరి పై స్టేషన్లమీదుగా బుధవారం 8.30 గంటలకు గోరక్‌పూర్‌కు చేరుకుంటుందని చెప్పారు.

క్రీడా సంబరం

నేటి నుంచి గ్రామాల్లో సీఎం కప్ క్రీడలు



- 15- 35ఏళ్ల మధ్య వయసున్న వారికి..
- వాలీబాల్, కబడ్డీ, ఖోఖో పోటీలు
- మండల, జిల్లా, రాష్ట్ర స్థాయిలో నిర్వహించనున్న వైనం

గద్వాల రూరల్: క్రీడలు మానసికోల్లాసాన్ని.. ఆరోగ్యాన్ని పెంపొందిస్తాయని భావించిన రాష్ట్ర ప్రభుత్వం గ్రామాలు మొదలుకుని, మండల, జిల్లా, రాష్ట్ర స్థాయిలలో వివిధ రకాల క్రీడా పోటీలను నిర్వహించేందుకు ఏర్పాట్లు షురూ చేసింది. ఈనెల 15వ తేదీ నుంచి 31వ తేదీ వరకు మండల, జిల్లా, రాష్ట్ర స్థాయిలో వివిధ క్రీడా పోటీలను నిర్వహించనుంది. గెలుపొందిన క్రీడాకారులకు వ్యక్తిగత, జట్టు పోటీలలో విజేతలకు నగదు పురస్కారాలను అందజేయనున్నారు. ఇందుకు సంబంధించి ప్రత్యేక కమిటీలు ఏర్పాటు చేశారు. కలెక్టర్ వల్లూరు క్రాంతి క్రీడా నిర్వాహణాధికారులకు దిశానిర్దేశం చేసి ఆదేశాలు జారీ చేశారు. జిల్లా వ్యాప్తంగా సోమవారం నుంచి అన్ని గ్రామాల్లో క్రీడలు ప్రారంభం కానున్నాయి.

మూడు స్థాయిల్లో క్రీడలు

సోమవారం నుంచి మండల స్థాయిలో వ్యక్తిగత, జట్టు విభాగాలకు సంబంధించిన ఆటపోటీలు నిర్వహించేందుకు అన్ని మండలాల ఎంపీడీఓలు ఏర్పాట్లు చేశారు. 15-36ఏళ్ల వయసున్న క్రీడాకారులకు వారి ఆసక్తిని బట్టి పోటీలు నిర్వహించనున్నారు. ముఖ్యంగా వాలీబాల్, కబడ్డీ, ఖోఖో వంటి పోటీలను నిర్వహించేలా చర్యలు చేపట్టారు. 15, 16, 17వ తేదీలలో మూడు రోజుల పాటు నిర్వహించే పోటీల్లో ప్రతిభ కనబర్చిన క్రీడాకారులను మండల స్థాయి జిల్లా స్థాయి జట్లకు ఎంపిక చేయనున్నారు. పోటీలు నిర్వహించేందుకు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన నిర్వహణ కమిటీలో ఆయా మండలాలకు ఎంపీపీలు చైర్మన్‌గా, ఎంపీడీఓ కన్వీనర్‌గా, జెడ్పీటీసీ సభ్యుడు, తహసీల్దార్, ఎంఈఓ లేదా గజిటెడ్ హెచ్‌ఎం, మున్సిపల్ ఏరియాలో కమీషనర్, పీడీ, లేదా పీఈటీలు సభ్యులుగా ఉంటారు.

రాష్ట్ర స్థాయి విజేతలకు నగదు బహుమతులిలా...

వ్యక్తిగత విభాగంలో	
ప్రథమ స్థానానికి	రూ.20వేలు
ద్వితీయ స్థానానికి	రూ.15వేలు
తృతీయ స్థానానికి	రూ.10వేలు

జట్టు విభాగంలో	
ప్రథమ స్థానం	రూ.లక్ష
ద్వితీయ స్థానం	రూ.75వేలు
తృతీయ స్థానం	రూ.50వేలు

22 నుంచి జిల్లా స్థాయి..

ఈ నెల 22వ తేదీ నుంచి 24తేదీ వరకు జిల్లా స్థాయి పోటీలు నిర్వహించనున్నారు. మొత్తం 11ఈవెంట్లలో పోటీలు నిర్వహిస్తారు. పురుషులకు, మహిళలకు అథ్లెటిక్స్, ఫుట్‌బాల్, కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, బాడ్మింటన్ వంటి క్రీడలు నిర్వహిస్తారు. ఈ పోటీల నిర్వహణకు కలెక్టర్ చైర్మన్‌గాను, ఎస్పీ వైస్ చైర్మన్, అదనపు కలెక్టర్ కో-వైస్ చైర్మన్, డీవైఎస్‌ఓ కార్యదర్శి, డీఈఓ ఇండస్ట్రీస్ జీఎం, మున్సిపల్ కమీషనర్లు సభ్యులుగా ఉంటారు. ఇక్కడ ప్రతిభ కనబర్చి గెలుపొందిన జట్లు రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటాయి.

ప్రతిభ కనబర్చాలి



గతంలో ఎన్నడూ లేనివిధంగా ప్రభుత్వం మండల, జిల్లా , రాష్ట్ర స్థాయిల్లో ఆట పోటీలు నిర్వహించడం చాలా మంచి పరిణామం. ఈ క్రీడల నిర్వహణ వల్ల గ్రామీణ స్థాయిలలో మంచి ప్రతిభ ఉన్న క్రీడాకారులకు గుర్తింపు వస్తుంది. ప్రభుత్వం నిర్వహించే ఈ పోటీలలో ఆయా విభాగాల్లో నైపుణ్యం ఉన్న క్రీడాకారులు పాల్గొని ప్రతిభ కనబర్చాలి.

– సతీష్‌కుమార్, అథ్లెటిక్స్ జిల్లా కార్యదర్శి

క్రీడలూ.. అవసరం



విద్యతో పాటు క్రీడలు కూడా అవసరం. ఇందులో భాగంగా ప్రభుత్వమే గ్రామ, జిల్లా, రాష్ట్ర స్థాయిలలో క్రీడలు నిర్వహించడం గొప్ప విషయం. ముఖ్యంగా ప్రతిభ ఉన్న ఆటగాళ్లు తమ సత్తాచాటేందుకు మంచి వేదిక. ఈఆటపోటీలు సద్వినియోగం చేసుకుని ఆటగాళ్లు రాణించాలి.

– రమేష్‌బాబు, ఇన్‌చార్జ్ డీఎస్‌ఓ


సద్వినియోగం చేసుకోవాలి



విజ్ఞానం ఎంత అవసరమో ప్రస్తుతం ఉన్న బిజీ లైఫ్‌లో క్రీడలు కూడా అంతే అవసరం. క్రీడలు ఆడటం వల్ల మనిషికి గెలుపోటములను సమానంగా స్వీకరించే సామర్థ్యం వస్తుంది. శారీరకంగా, మానసికంగా కూడా దృఢంగా ఉంటారు. ప్రభుత్వం నిర్వహించే వివిధ రకాల క్రీడలలో ప్రతిభ ఉన్న ఆటగాళ్లు పాల్గొని అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

– వల్లూరు క్రాంతి, కలెక్టర్

నేటినుంచి ఇంటర్ అడ్మిషన్లు



మహబూబ్‌నగర్‌లోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో చదువుకుంటున్న విద్యార్థులు (ఫైల్)

ఉమ్మడి జిల్లాలో 176 ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలలు

- ప్రవేశాలపై మార్గదర్శకాలు విడుదల చేసిన ఇంటర్మీడియట్ బోర్డు
- ఎస్సెస్సీలో వచ్చిన గ్రేడింగ్ ఆధారంగా చేరికలకు అవకాశం
- నిర్వహణ సరిగా లేని కళాశాలలపై పట్టింపు కరువు
- కళాశాలల్లో హాస్టళ్లు, కోచింగ్ సెంటర్లు నిర్వహిస్తున్నా పట్టని వైనం

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: ప్రభుత్వం విద్యా సంవత్సరం ప్రారంభానికి ముందే ఇంటర్మీడియట్ అడ్మిషన్లపై ప్రత్యేక దృష్టిసారించింది. ప్రతి సంవత్సరం ప్రభుత్వం అడ్మిషన్లకు అనుమతులు ఇవ్వక ముందే ప్రైవేటు యాజమాన్యాలు విద్యార్థులను చేర్పించుకునేవారు. అంతేకాకుండా కొన్ని కళాశాలల్లో విద్యార్థులకు అర్హత పరీక్షలు సైతం నిర్వహించేవారు. దీనిని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం సోమవారం నుంచి అడ్మిషన్లకు అవకాశం కల్పించింది. అంతేకాకుండా అఫ్లియేషన్ ఉన్న కళాశాలల్లో మాత్రమే విద్యార్థులు చేరాలని సూచించింది. అయితే అఫ్లియేషన్ ఉన్నది.. లేని కళాశాలల వివరాలు మాత్రం బోర్డు వెబ్‌సైట్‌లో చూపించలేదు. అఫ్లియేషన్ ఉన్న కళాశాలల జాబితాను మరో వారం రోజుల్లో అందుబాటులో ఉంచుతుందని జిల్లా ఇంటర్ బోర్డు అధికారులు పేర్కొంటున్నారు. ఈ క్రమంలో ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 176 ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలలు ఉండగా.. ఇందులో 96 ప్రభుత్వ పరిధిలో నడిచే కేజీబీవీ, రెసిడెన్సియల్, గురుకులాల కళాశాలలు ఉన్నాయి. వీటిలో సుమారు 42,000 మందికిపైగా చేరే అవకాశం ఉంది.

నిబంధనలు పాటించాల్సిందే..

ఇంటర్ అడ్మిషన్ల ప్రక్రియలో పలు నిబంధనలు పాటించాలని ప్రభుత్వం సూచిస్తుంది. ఇందులో ప్రధానంగా ఇంటర్‌లో కేవలం టెన్త్ జీపీఏ ఆధారంగా అడ్మిషన్లు తీసుకోవాలి. అలాగే ప్రతి కళాశాలలో రిజర్వేషన్లు కచ్చితంగా అమలు చేయాలి. ఎస్సీలకు 15, ఎస్టీలకు 10, బీసీలకు 29, పీహెచ్‌సీ 3, ఎన్‌సీసీ, స్పోర్ట్స్ ఇతర అర్హతలు 5, ఎక్స్ సర్వీస్ వారి పిల్లలకు 3, ఈడబ్ల్యూఎస్ వారికి 10 శాతం కేటాయించాలి. ముఖ్యంగా మొత్తం బాలికల్లో 33 శాతం రిజర్వేషన్ పాటించాలని సూచించింది. ఒక సెక్షన్‌లో 88 మందిని మాత్రమే చేర్చుకోవాలి. విద్యార్థుల సంఖ్య పెరిగితే అదనపు సెక్షన్ కోసం బోర్డు నుంచి అనుమతి తీసుకోవాలి. విద్యార్థుల చేరికలు, ఖాళీలకు సంబంధించి ప్రతిరోజు వివరాలను బోర్డుపై ప్రదర్శించాలి. నిబంధనలు ఉల్లంఘించే వారిపై చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు.

ఉమ్మడి జిల్లా పరిధిలో ఇలా..

జిల్లా	ప్రభుత్వ కళాశాలలు	ప్రైవేటు కళాశాలలు
మహబూబ్‌నగర్	21	26
జోగులాంబ గద్వాల	19	12
నారాయణపేట	11	5
నాగర్‌కర్నూల్	15	14
వనపర్తి	30	23

అడ్డగోలుగా నిర్వహణ..

ఉమ్మడి జిల్లాలో కొన్ని ప్రైవేటు జూనియర్ కళాశాలలు అడ్డగోలుగా నిర్వహిస్తున్నాయి. కొన్ని ఒకేషనల్ కళాశాలల్లో ల్యాబ్‌లు ఇతర పరికరాలు లేకుండా తూతూమంత్రంగా నెట్టుకొస్తున్నాయి. అధికారులు తనిఖీల సమయంలో నామమాత్రంగా ఎక్విప్‌మెంట్ పెట్టి మేనేజ్ చేస్తున్నారు. అధ్యాపకులు సైతం సరిగా లేకపోవడం, ఒకే అధ్యాపకుడితో పలు సబ్జెక్టులు బోధిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఇక ప్రభుత్వ కళాశాలల్లో సరైన సదుపాయాలు, బోధించేందుకు సిబ్బంది లేకపోవడం వంటి సమస్యలతో సతమతమవుతున్నాయి. ఈ కారణాలతోనే ప్రతి సంవత్సరం ఇంటర్ ఫలితాల్లో ఉమ్మడి జిల్లా వెనకబడుతున్నట్లు విద్యార్థి సంఘాలు ఆరోపిస్తున్నాయి. అంతేకాకుండా కొన్ని కళాశాలల్లో అనుమతులు లేకుండా హాస్టళ్లు, కోచింగ్ సెంటర్లు నిర్వహిస్తున్నా.. అధికారులు పట్టించుకోవడం లేదు.

అఫ్లియేషన్ ఉన్న వాటిలోనే..

అడ్మిషన్లు కేవలం అఫ్లియేషన్ ఉన్న కళాశాలల్లోనే చేరాలని సూచిస్తుంది. అయితే కొన్ని కళాశాలలు ఫైర్‌సేఫ్టీ లేకపోవడం, మిక్స్‌డ్ ఆక్యుపెన్సీ ఉండటం ప్రధాన సమస్య కాగా.. అఫ్లియేషన్ ఇచ్చేందుకు ప్రభుత్వం నిరాకరిస్తుంది. అయితే ఫైర్ సేఫ్టీకి సంబంధించి గతేడాది ఒకేసారి రెండేళ్లకు అనుమతి ఇచ్చింది. 17 మీటర్ల కన్న తక్కువ ఎత్తు ఉన్న వాటికే ఎన్‌ఓసీ ఇవ్వనున్నట్లు తెలుస్తుంది. సిబ్బంది వివరాలు, స్ట్రక్చరల్ సౌండ్, ఫిక్స్‌డ్ డిపాజిట్లు, సేల్ డీడ్, అగ్రిమెంట్ వంటివి ప్రభుత్వానికి అఫ్లియేషన్ కోసం దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. దాదాపుగా అన్ని కళాశాలలకు అఫ్లియేషన్ వచ్చే అవకాశాలున్నట్లు సమాచారం.

ఆదేశాలు వచ్చాయి..

సోమవారం నుంచి అడ్మిషన్లు తీసుకునేందుకు ప్రభుత్వం ఆదేశించింది. వాటి ఆధారంగా రిజర్వేషన్లు తదితర అంశాలపై కళాశాలలు దృష్టి సారించాలి. ఇక అఫ్లియేషన్ ఉన్న కళాశాలల్లో చేరాలని మాత్రమే ప్రభుత్వం సూచించింది. ఇందుకు సంబంధించిన జాబితాను త్వరలోనే ఆన్‌లైన్‌లో పెట్టే అవకావం ఉంది. వీటిని విద్యార్థులు గమనించాలి.

– వెంకటేశ్వర్లు, డీఐఈఓ, మహబూబ్‌నగర్

మూడోసారి ప్రజలు నమ్మరు..



మాట్లాడుతున్న మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

- పెండింగ్ పనులకు మెరుగులద్ది గొప్పలు చెప్పకొంటున్నారు
- పాలమూరు- రంగారెడ్డి, సీతారామ ప్రాజెక్టుల మాటేమిటి
- మీలాగే రైతులకు రూ.కోట్లల్లో లాభం ఎందుకురాదు
- మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

వనపర్తి: గత ప్రభుత్వాల హయాంలో చేపట్టిన సాగునీటి ప్రాజెక్టుల పెండింగ్ పనులకు మెరుగులు దిద్ది తామే సాగునీళ్లు తీసుకొచ్చామని గొప్పలు చెప్పుకోవడం ఏమిటని మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఆదివారం వనపర్తి జిల్లాకేంద్రంలో పెద్దమందడి ఎంపీపీ మేఘారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఆత్మగౌరవ సభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కేసీఆర్ హయాంలో శంకుస్థాపన చేసిన ఖమ్మంలోని సీతారామ ప్రాజెక్టు, పాలమూరు- రంగారెడ్డి ఎత్తిపోతలను ఏళ్లు గడుస్తున్నా ఎందుకు పూర్తి చేయలేకపోయారని ప్రశ్నించారు. గత ప్రభుత్వాల హయాంలోనే కేఎల్‌ఐ, భీమా, జూరాల ప్రాజెక్టులు నిర్మించారని ఆయన గుర్తుచేశారు. చేసే పనులు తక్కువ.. చెప్పుకొనే గొప్పులు ఎక్కువ అనే విషయాన్ని ప్రజలు ఈసారి గుర్తిస్తారన్నారు. ఇప్పటికే రెండుసార్లు మాయ మాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన కేసీఆర్‌ను మూడోసారి నమ్మేందుకు ప్రజలు సిద్ధంగా లేరన్నారు. అకాల వర్షాలతో నష్టపోయిన పంటలకు తక్షణం ఎకరాకు రూ.10 వేల పరిహారం ఇస్తానని ప్రకటించి 50 రోజులు గడుస్తున్నా ఇప్పటికీ నయాపైస ఇవ్వలేదని, సీఎం కేసీఆర్ భాషలో తక్షణం అంటే.. నెలల తరబడి అర్థం కావచ్చు అని ఎద్దేవా చేశారు. నిబంధనలకు విరుద్ధంగా మాజీ సీఎస్‌కు కేబినెట్ హోదా కలిగిన బాధ్యతలు అప్పగించడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు.

ఆర్నెళ్లలో కేసీఆర్ పనైపోతది..

కేసీఆర్ ఫాంహౌస్‌లో పండిన క్యాప్సికంకు రూ.కోట్ల లాభాలు ఎలా వస్తున్నాయి.. పేదరైతులు పండించిన పంటలకు నష్టాలు ఎందుకు వస్తున్నాయని పొంగులేటి ప్రశ్నించారు. మీకులాగే.. రూ.కోట్ల ఆదాయం వచ్చిన సామాన్య రైతులు రాష్ట్రంలో ఎంత మంది ఉన్నారో.. సీఎం కేసీఆర్, వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి గుర్తించి ప్రజలకు చెప్పాలన్నారు. మరో ఆర్నెళ్లలో రాష్ట్రంలో సీఎం కేసీఆర్ పని అయిపోతుందన్నారు.

పని నేను చేస్తే.. డబ్బులు మంత్రి తీసుకున్నారు

నన్ను పనిచేసుకుని బతికే కూలోడని విమర్శించిన మంత్రి నిరంజన్‌రెడ్డి నేను చేసిన పనికి సంబంధించిన బిల్లులు తాను ఎందుకు తీసుకున్నాడో సమాధానం చెప్పాలని పెద్దమందడి ఎంపీపీ మేఘారెడ్డి డిమాండ్ చేశారు. నాలాంటి వాళ్లు ఎందరో కష్టపడి పనిచేసి గెలిపిస్తే.. మంత్రి నటించుడు.. నమ్మించుడు.. మోసం చేసుడు అనే నైజం చూపించారన్నారు. 2014 అఫిడవిట్‌లో పేర్కొన్న ఆస్తులు, ఇప్పుడు ఉన్న ఆస్తుల లెక్కలకు ఏ రకంగా పొంతన కుదరడం లేదన్నారు. కార్యక్రమంలో ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పిడమర్తి రవి, వనపర్తి ఎంపీపీ కిచ్చారెడ్డి, నాయకులు సత్యారెడ్డి, సాయిచరణ్‌రెడ్డి, వెంకటస్వామి, బ్రహ్మం, వెంకటేష్, రాధాకృష్ణ పాల్గొన్నారు.

జెడ్పీచైర్మన్ దుమ్మా..

ఆత్మగౌరవం లేనిచోట ఉండలేమని ఎంపీపీలతో పాటే బీఆర్‌ఎస్‌ను వీడిన వనపర్తి జెడ్పీ చైర్మన్ ఆర్. లోక్‌నాథ్‌రెడ్డి ఆదివారం నాటి ఆత్మగౌరవ సభకు గైర్హాజరయ్యారు. పొంగులేటి, జూపల్లి కృష్ణారావులతో కలిసి ముందుకు సాగాలని ముందుగా నిర్ణయం తీసుకున్నా.. అకస్మాత్తుగా వారి మధ్యలో పార్టీ ఎంపిక విషయంలో భేదాభిప్రాయాలు వచ్చినట్లు తెలుస్తోంది.

ఎన్నిసార్లు జైలుకు వెళ్లావు నిరంజన్‌రెడ్డి..



సీఎం కేసీఆర్‌కు కుడి భుజంగా చెప్పుకొనే వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి తెలంగాణ రాష్ట్రసాధన కోసం చేసిన ఉద్యమంలో ఎన్నిసార్లు జైలుకు వెళ్లావో ప్రజలకు వివరించాలని మాజీ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. 2014 ఎన్నికల్లో ఓటమిపాలైన నిరంజన్‌రెడ్డి ప్లానింగ్ బోర్డు వైస్ చైర్మన్‌గా వ్యవహరిస్తూ.. రూపొందించిన ప్రభుత్వ పథకాల్లో ముఖ్యమైన డబుల్ బెడ్‌రూం ఇళ్లు, దళితులకు మూడెకరాల భూమి ఎంత మంది పేదలకు ఇచ్చారో గ్రామాల వారీగా చెప్పాలని డిమాండ్ చేశారు. ఎన్నికల సమయంలో పేర్కొన్న ఎన్ని పనులు పూర్తి చేశారో వెల్లడించాలన్నారు. నా ఇంట్లో దివంగత ముఖ్యమంత్రి వైఎస్‌ఆర్ ఫొటో గురించి మాట్లాడటం ఏం సంస్కారమని, సీఎం, మంత్రి నిరంజన్‌రెడ్డి ఎవరింట్లో.. ఎవరి ఫొటోలు పెట్టుకోవాలనే దానిపై జీఓ విడుదల చేయాలన్నారు. నీవు.. నీ దోస్తులు కుట్ర చేసినందుకే 2018లో ఓడిపోయానంటూ.. నిరంజన్‌రెడ్డినుద్దేశించి జూపల్లి విమర్శలు చేశారు.

నేడు మంత్రి సత్యవతి రాథోడ్ రాక

మన్ననూర్: రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సత్యవతి రాథోడ్ సోమ, మంగళవారాల్లో జిల్లాలో పర్యటించనున్నారు. మన్ననూరులోని పీహెచ్‌సీలో డయాగ్నోస్టిక్ హబ్ ప్రారంభోత్సవం, చెంచు లక్ష్మీ గెస్ట్‌హౌజ్ ఆధునీకరణ పనులకు భూమిపూజ చేస్తారు. చెంచులకు కుట్టు మిషన్లు అందజేస్తారు.

‘పట్టు’ కోసం ప్రయత్నం

- కరోనా కారణంగా కుదేలైన పట్టు పరిశ్రమ
- గాడిన పెట్టేందుకు.. అభివృద్ధికి ఉద్యానశాఖ చర్యలు
- సిల్క్ సమగ్ర పథకం ద్వారా రైతులకు సబ్సిడీ



గట్టు మండలం మార్లబీడులో సాగు చేసిన మల్బరీతోటను పరిశీలిస్తున్న పట్టు పరిశ్రమ అధికారి జనార్దన్


గద్వాల వ్యవసాయం: జిల్లాలో పట్టుపరిశ్రమ అబివృద్ధిపై ఉద్యానశాఖ దృష్టి సారించింది. మల్బరీ తోటల సాగు, పట్టుపురుగుల పెంపకం జిల్లాలో ఆశించిన స్థాయిలో ఉండేది. అయితే, కరోనా వ్యాప్తి, లాక్‌డౌన్ కారణంగా పట్టు పరిశ్రమ కుదేలైంది. ఈక్రమంలో చాలా మంది రైతులు పట్టు పురుగుల పెంపకాన్ని నిలిపివేసి మల్బరీతోటల స్థానంలో ఇతర పంటలు వేస్తున్నారు. అయితే పట్టు పరిశ్రమ తిరిగి అభివృద్ధి చేయాలని ఉద్యానశాఖ చర్యలు ఆరంభించింది. ఇందులో భాగంగా ‘సిల్క్ సమగ్ర’ పథకాన్ని తీసుకొచ్చింది.

పట్టు పరిశ్రమకు అనుకూలంగా..

పట్టుపరిశ్రమకు జిల్లాలో అనువైన పరిస్థితులు ఉన్నాయి. మల్బరీ తోటలకు ఎర్రటి, ఇసుకతో కూడిన ఎర్రని, ఒండ్రుతో కూడిన ఎర్రని నేలలు ఉండాలి. జిల్లాలో ఇలాంటి నేలల శాతమే ఎక్కువగా ఉంది. వాతావరణ పరిస్థితులు అనుకూలంగా ఉన్నాయి. ఉదాహరణకు వేసవిలో పగటి ఉష్ణోగ్రతలు ఎంత ఉన్నా.. సాయంత్రం నుంచి రాత్రంగా చల్లగా ఉంటుంది. శీతాకాలంలో ఎంత చలి ఉన్నా ఉష్ణోగ్రతలు పూర్తిగా పడిపోవు. అధిక వర్షాలు తక్కువే. ఇలా వాతావరణ పరిస్థితులు అనుకూలంగా ఉన్నాయి. మల్బరీ తోటలు, పట్టు పురుగుల పెంపకానికి ఐదెకరాలలోపు ఉన్న సన్న, చిన్న కారు రైతులకు సబ్సిడీ పొందేందుకు అవకాశం కల్పించారు. పెట్టుబడిలో 40శాతం రైతు అందిస్తే మిగిలిన 60శాతం ఉపాధి హమీ పథకం కింద సమకూరుస్తారు. మల్బరీ తోటలు వేసి పట్టు పురుగులను పెంచి, జిల్లాలో పట్టు పరిశ్రమను క్రమంగా అభివృద్ధి చేయాలని ఉద్యానశాఖ అధికారులు దాదాపు పదేళ్ల నుంచి కృషి చేస్తున్నారు. ఈక్రమంలో ఈప్రాంతంలోని మల్దకల్, ధరూర్, గట్టు మండలాల పరిదుల్లో మల్బరీ తోటల పెంపకంతో పాటు, షెడ్లు ఏర్పాటు చేసి పట్టు పురుగులను పెంచారు. క్రమమైన పద్ధతిలో తోటల పెంపకాన్ని చేపడుతూ, షెడ్డు నిర్వహణ చేస్తూ, సిల్క్ దారం ఉండే పట్టు గూళ్లను ఇతర ప్రాంతాల్లో విక్రయిస్తూ ఆదాయాన్ని సమకూర్చుకునేవారు.

జిల్లా వివరాలిలా..

2019నాటికి జిల్లాలో మల్బరీ తోటలు	ప్రస్తుతం జిల్లాలో మల్బరీ తోటలు
295 ఎకరాలు	80 ఎకరాలు
షెడ్‌లు 72	షెడ్‌లు 38



పట్టు పురుగులు

సబ్సిడీలపై అవగాహన కల్పిస్తూ..

కోవిడ్ ప్రభావం తగ్గాక ఉద్యానశాఖ జిల్లాలో పట్టు పరిశ్రమపై దృష్టి సారించింది. కరోనాకు ముందు పట్టు పురుగులను పెంచి, మల్బరీ తోటలు సాగు చేసిన రైతులకు తిరిగి పెంపకం చేపట్టేలా సలహాలు సూచనలు ఇచ్చారు. కొంతమంది రైతులు మళ్లీ ముందుకు వచ్చి మల్బరీ సాగు చేపట్టారు. కొత్త వారికి సైతం అవగాహన కల్పించారు. అయినప్పటికి ఆశించిన స్థాయిలో ఫలితం రాలేదు. దీంతో పట్టు పరిశ్రమను ఎలాగైనా అభివృద్ధిలోకి తీసుకొచ్చేందుకు ఉద్యానశాఖ ఇటీవలే మళ్లీ చర్యలు ఆరంభించింది. ఈక్రమంలో జిల్లాలో 70 యూనిట్లతో సిల్క్ సమగ్ర పథకాన్ని తీసుకొచ్చింది. ఈపథకం ద్వార మల్బరీతోటల సాగుకు,ప ట్టుపరుగుల షెడ్ల నిర్మాణానికి జనరల్ కేటగిరీ రైతులకు 50శాతం, ఎస్సీ ఎస్టీ రైతులకు 65శాతం ప్రభుత్వం వాటా ఇస్తుంది. మిగిలిన పెట్టుబడిని రైతులు భరించాల్సి ఉంటుంది. దీంతో పాటు కిసాన్ నర్సరీలకు సైతం ప్రోత్సాహకాన్ని ఉద్యానశాఖ అందివ్వనుంది. పథకం అమల్లో భాగంగా ఆసక్తి గల రైతుల నుంచి ఉద్యానశాఖ దరఖాస్తులు స్వీకరిస్తోంది. ఇలా ఈపథకం ద్వార రైతులను బాగా ప్రోత్సహించి, పట్టుపరిశ్రమను తిరిగి అభివృద్ధి చేయాలని ఆశాఖ అధికారులు ప్రయత్నాలు ఆరంభించారు. ప్రస్తుతం మార్కెట్‌లో పట్టు కాయల ధర కేజీ రూ. 400 నుంచి రూ. 650 వరకు ఉందని ఉద్యానశాఖ అధికారులు చెబుతున్నారు. ఏడాది పొడవునా ఏడు పంటలు పండించినా రూ. 7లక్షల వరకు ఆదాయం వస్తుందని, రైతులు దీనిపై దృష్టి సారించాలంటున్నారు.

కరోనాతో దెబ్బ

2019 మార్చి చివరి వారంలో కరోనా వ్యాప్తి చెందడంతో ప్రభుత్వం లాక్‌డౌన్ విధించింది. ఈక్రమంలో పలు రంగాలతో పాటు పట్టు పరిశ్రమ దెబ్బతింది. తిరిగి సెకండ్ వేవ్ ప్రభావం సైతం ఈ రంగంపై పడింది. ఫలితంగా మార్కెట్‌లో సిల్క్‌కు ధరలు తగ్గాయి. ఈ కారణంగా ఇక్కడి రైతులు ఒక్కొక్కరుగా పట్టు పురుగుల పెంపకాన్ని నిలిపి వేస్తూ వచ్చారు. మల్బరీ తోటల స్థానంలో ఇతర పంటలు వేయడం ఆరంభించారు. కొంతమంది రైతులు మాత్రమే యథావిధిగా పెంచుతూ వచ్చారు.

దరఖాస్తులు స్వీకరిస్తున్నాం



జిల్లాలో పట్టుపరిశ్రమను అభివృద్ధి చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నాము. పట్టు పురుగుల పెంపకం, షెడ్ల నిర్మాణణం కోసం సిల్క్ సమగ్ర పథకం కింద ఆసక్తి గల రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నాం. ప్రస్తుతం మార్కెట్‌లో సిల్క్‌కు మంచి ధరలు ఉన్నాయి.

– మహమ్మద్ అలీ అక్బర్, జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమ శాఖ అధికారి

కాటేస్తున్న కల్తీ విత్తనాలు

- తారుమారవుతున్న దిగుబడి అంచనాలు
- లబోదిబోమంటున్న రైతన్నలు
- తనిఖీలకే పరిమితవుతున్న అధికారులు
- జాడలేని రైతు చైతన్యయాత్రలు

జడ్చర్ల: యేటా రైతన్న కల్తీ, నాణ్యతలేని విత్తనాలను సాగు చేసి అప్పుల ఊబిలో కూరుకుపోతున్నాడు. విత్తనాల ప్యాక్‌లు చూడడం, సదరు విత్తన వ్యాపారి చెప్పే మాటలను నమ్మడంపైనే ఆధారపడి రైతులు పంటలు సాగు చేస్తున్నారు. దీనికి సరైన శాస్త్రీయత ఆధారాలు ఎక్కడాలేవు. విత్తనాల కొనుగోలు సమయంలో విత్తన వ్యాపారులు ఎకరాకు ఇంత దిగుబడి వస్తుందని చెప్తున్నా, తరువాత ఆ దిగుబడి రాక రైతులు నష్టపోతున్నారు. ఏటా ఇలాగే ఎదురవుతోంది. దీనికి బాధ్యులెవరో అర్థంకాని పరిస్థితి నెలకొంది. దిగుబడి తగ్గిందని ప్రశ్నిస్తే.. సదరు వ్యాపారులు ప్రకృతిపై నెట్టడమో, సరైన విధానాలను రైతులు పాటించలేదనో, ఇతర కారణాలు చూపుతున్నారు. దీనికి అధికారులు సైతం వంత పాడుతున్నారు. ఫలితంగా రైతులు అప్పులపాలవుతున్నారు.

జిల్లాలో పత్తికి ప్రాధాన్యత..

జిల్లాలో వివిధ పంటలకు సంబంధించి ఈ ఏడాది వానాకాలం సీజన్‌లో మొత్తం 3.88లక్షల ఎకరాలలో పత్తి, మొక్కజొన్న, వరి, కందులు, జొన్న, ఆముదాలు తదితర పంటలు సాగుచేసే అవకాశం ఉందని జిల్లా వ్యవసాయ శాఖ అంచనా వేసింది. అయితే ఇందులో దాదాపుగా 1.30 లక్షల ఎకరాలలో పత్తిని సాగుచేసే పరిస్థితి ఉందంటున్నారు. గత ఏడాది కూడా సాధారణ సాగును మించి పత్తిని సాగుచేశారు. అయితే ప్రధానంగా పత్తి, వరి విత్తనాలలో కల్తీ జరుగుతుందన్న ఆరోపణలు తీవ్రంగా ఉన్నాయి. గతంలో నకిలీ పత్తి విత్తనాలను స్థానికంగా తయారు చేసి రైతులకు అంటగట్టిన పరిస్థితులు ఉన్నాయి. ఈ ఏడాది కూడా నకిలీ విత్తనాలను అంటగట్టే ప్రమాదముందని, వ్యాపారులకు అధిక లాభాలు తెచ్చిపెట్టే నకిలీ విత్తనాలను నియంత్రించే విధంగా సంబంధిత అధికారులు పకడ్బందీ చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

తనిఖీలకే పరిమితం..

వ్యవసాయ అధికారులు సంబంధిత విత్తన, పురుగు మందుల దుకాణాలలో తనిఖీలు చేసి తంతు పూర్తయ్యిందని అనుకుంటున్నారు. కానీ కొందరు వ్యాపారులు గుట్టుగా నాణ్యత లేని విత్తనాలను రైతులకు అంటగట్టే విధంగా రహస్య ప్రణాళికలతో ముందుకు కదులుతున్నారు. చూడ్డానికి దుకాణాలలో మంచి విత్తనాలు పెడుతున్నా ఇతర ప్రాంతాలలో తమకు కమీషన్‌లు, లాభాలు అధికంగా వచ్చే నాణ్యత లేని విత్తనాలను రైతులకు సరఫరా చేసే పరిస్థితి ఉందని రైతులు అంటున్నారు. ప్రధానంగా జిల్లా కేంద్రంతో పాటు జడ్చర్ల, భూత్పూర్, కోస్గి తదితర ప్రాంతాలలో ఈ వ్యవహారం గుట్టుగా సాగుతున్నట్లు తెలుస్తుంది. గతంలో జడ్చర్లలో రహస్యంగా నకిలీ బీటీపత్తి విత్తనాలను తయారు చేస్తుండగా విజిలెన్స్ అధికారులు పట్టుకుని కేసులు నమోదు చేసిన సంఘటనలు ఉన్నాయి.



పత్తి ప్రాసెసింగ్ యూనిట్‌లో తనిఖీలు చేస్తున్న టాస్క్‌ఫోర్స్ బృందం

అవగాహన ఏది?

వానాకాలం ప్రారంభమైనా ఇప్పటివరకు వ్యవసాయ అధికారులు రైతులకు కనీస అవగాహన కార్యక్రమాలు చేపట్టలేదు. గతంలో వానాకాలం సీజన్ ప్రారంభానికి ముందే రైతు చైతన్య యాత్రలు, రైతు అవగాహన సదస్సులు నిర్వహించే పరిస్థితి ఉండేది. ఈ ఏడాది ఇప్పటివరకు అలాంటి కార్యక్రమాలను చేపట్టలేదు. విత్తనాల నాణ్యత, ఏ సమయంలో విత్తనాలు సాగు చేయాలి? ఎక్కడెక్కడ విత్తనాలను కొనుగోలు చేయాలి? కొనుగోలు సమయంలో ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి? సమస్యలపై ఎవరికి ఫిర్యాదు చేయాలి? తదితర అనేక సమస్యలపై వ్యవసాయశాఖ అధికారులు క్షేత్రస్థాయిలో రైతులకు అవగాహన కల్పించాల్సి ఉన్నా ఆ దిశగా చర్యలు తీసుకోలేదన్న విమర్శలు ఉన్నాయి.



విజిలెన్స్ తనిఖీల్లో పట్టుబడిన నకిలీ విత్తనాలు (ఫైల్)

పత్తికాయల సైజు చిన్నగా..



ఓ విత్తన వ్యాపారి సూచనల మేరకు వానాకాలంలో పత్తి విత్తనాలు కొనుగోలు చేసి రెండు ఎకరాలలో సాగు చేశాను. అయితే పత్తి పంటకు ఎరువులు బాగా వేయడం, తదితర సస్యరక్షణ చర్యలు తీసుకున్నా చెట్టుకు కాసే కాయలు మాత్రం చిన్నవిగా కాసాయి. సైజు పెరగకపోవడంతో పత్తి దిగుబడి గణనీయంగా తగ్గింది. రెండు ఎకరాలలో రెండు క్వింటాళ్ల పత్తి మాత్రమే దిగుబడి వచ్చింది. విత్తనాలు కొనుగోలు చేసే సమయంలో సదరు వ్యాపారి పత్తికాయల సైజు బాగా వస్తుందని చెప్పాడు. తీరా చిన్నకాయలు రావడంతో దిక్కుతోచని స్థితిని ఎదుర్కొన్నాను.

– పాండునాయక్, రైతు, యాసాయకుంటతండా

నకిలీ విత్తనాలపై ప్రత్యేక నిఘా..



నకిలీ విత్తనాలపై ప్రత్యేక నిఘా పెట్టాము. పోలీసు శాఖ, వ్యవసాయ శాఖల ఆధ్వర్యంలో సంయుక్తంగా తనిఖీలు నిర్వహిస్తున్నాం. భూత్పూర్‌లో గల పత్తి ప్రాసెసింగ్ యూనిట్లను తనిఖీలు చేసి షాంపుల్స్ తీశాము. నకిలీ విత్తనాలు అమ్మకుండా విత్తన డీలర్లకు కచ్చితమైన ఆదేశాలు ఇచ్చాము. ఇతరప్రాంతాల నుంచి గుట్టుగా వచ్చే విత్తనాలపై దృష్టి సారించాము.

– బి.వెంకటేశ్, జిల్లా వ్యవసాయాధికారి

బీటీ-3 విత్తనాలు రాక..?

ప్రభుత్వం నిషేధించిన బీటీ-3 విత్తనాలను రైతులకు అంటగట్టేందుకు కొందరు వ్యాపారులు ప్రయత్నిస్తున్నారు. బీటీ-3 విత్తనాలను నియంత్రించేందుకు జిల్లా అధికార యంత్రాంగం ఎంతగా ప్రయత్నిస్తున్నా ఏటా ఎక్కడో ఓ దగ్గర ఆయా విత్తనాలను రైతులకు వ్యాపారులు అంటగడుతున్నారు. కలుపు నివారణ కారణంగా కొందరు రైతులు బీటీ-3 విత్తనాల సాగుపై ఆసక్తి చూపడంతో బీటీ-3 విత్తనాలు అక్కడక్కడ సాగవుతున్నాయి. కాగా బీటీ-3 విత్తనాలను ఎవ్వరూ కొనుగోలు చేయవద్దని ఈ సందర్భంగా వ్యవసాయ అధికారులు విజ్ఞప్తి చేస్తున్నారు. అదే విధంగా బీజీ-2 విత్తనాల ప్యాకెట్ ధర రూ.853గా ప్రభుత్వం నిర్ణయించిందని, రైతులు అంతకుమించి కొనుగోలు చేయవద్దన్నారు. రైతులు కొనుగోలు చేసే విత్తనాలు, తదితర వాటికి తప్పనిసరిగా బిల్లులు తీసుకోవాలని తెలిపారు.

నవజాత శిశువులకు మదర్ కేర్

- జిల్లాలో బరువు తక్కువ, నెలలు నిండని చిన్నారులు ఎందరో..
- అవగాహన కల్పిస్తేనే ప్రయోజనం
- నేడు ప్రపంచ కంగారు మదర్ కేర్ దినోత్సవం

పాలమూరు: నవజాత శిశువుల సంపూర్ణ ఆరోగ్యం కోసం కంగారు మదర్ కేర్ విధానం ఎంతో ముఖ్యం. అయితే ఈ పద్ధతిపై చాలా వరకు గ్రామీణ ప్రాంతాల్లో ఉండే బాలింతలకు అవగాహన లేకపోవడం వల్ల దీనిద్వారా లాభాలు పొందలేకపోతున్నారు. ఈ క్రమంలో సోమవారం అంతర్జాతీయ కంగారు మదర్ కేర్ దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం..

ఇలా చేయాలి..

నెలలు నిండని, బరువు తక్కువ గల నవజాత శిశువులను తల్లి ఛాతి మధ్యలో ఉంచి, తల్లి శరీర వెచ్చదనం శిశువు శరీరానికి తగిలేలా ఉంచుకోవాలి. ఈ పద్ధతిని రోజులో తల్లికి వీలైనంత సేపు ఉంచుకోవచ్చు. ఈ పద్ధతి ఒక తల్లే కాకుండా ఇతర కుటుంబ సభ్యులు సైతం చేయవచ్చు.

చేకూరే ప్రయోజనాలు..

- నెలలు తక్కువ గల నవజాత శిశువులు, బరువు 1800 గ్రాముల తక్కువ గల శిశువులకు ఈ పద్ధతి ఇవ్వాలి. దీంతో తల్లి- బిడ్డల మధ్య అనుబంధాన్ని పెంచుతుంది.
- తల్లిలో పాల శాతం పెరుగుతుంది. శిశువుకు ఇన్‌ఫెక్షన్ రాకుండా కాపాడవచ్చు.
- బిడ్డను వెచ్చగా ఉంచుకోవడం వల్ల బరువు త్వరగా పెరుగుతారు.
- కంగార మదర్ కేర్ ఇవ్వడం వల్ల శిశువులు త్వరగా కోలుకోవడమే కాకుండా ఆస్పత్రిలో ఉండే సమయం కూడా తగ్గుతుంది. ఎలాంటి ఆర్థికపరమైన ఖర్చులు అవసరం లేదు.
- శిశు మరణాలు 40 శాతం వరకు తగ్గించవచ్చు.
- పుట్టిన వెంటనే బరువు / నెలలు తక్కువ గల నవజాత శిశువులకు ఇవ్వడం వల్ల ఇంకా త్వరగా శిశువు కోలుకునే అవకాశం ఉందని పరిశోధనల్లో తేలింది.
- మనదేశంలో ప్రతి 100 ప్రసవాల్లో 13 మంది శిశువులు, నెలలు నిండని, బరువు తక్కువ గలవారు పుడుతున్నారు.

అవగాహన కల్పిస్తున్నాం..

ప్రస్తుతం కంగారు మదర్ కేర్ పద్ధతి గ్రామీణ ప్రాంతాల్లో బాలింతలు, గర్భిణులకు అవగాహన కలిగి ఉండాలి. చాలా వరకు పల్లెలు, మారుమూల ప్రాంతాల్లో ఈ పద్ధతి గురించి తెలియకపోవడం వల్ల శిశువు ఆరోగ్యంపై ప్రభావం చూపుతోంది. ఈ క్రమంలో రవి చిన్నపిల్లల ఆస్పత్రి ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నాం.

– శేఖర్, చిన్నపిల్లల వైద్యనిపుణుడు, మహబూబ్‌నగర్

క్లుప్తంగా

రైలు కిందపడి యువకుడి మృతి



శివకుమార్ (ఫైల్)

దేవరకద్ర రూరల్: రైలు కిందపడి ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన ఆదివారం చోటు చేసుకుంది. రైల్వే పోలీసులు, స్థానికుల కథనం మేరకు.. మండలంలోని వెంకటాయపల్లికి చెందిన శివకుమార్ (27) ఆదివారం తెల్లవారుజామున గ్రామ సమీపంలో రైలు కిందపడి మృతిచెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా ఆస్పత్రికి తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే ఎస్‌ఐ తెలిపారు.

మృతదేహం లభ్యం

అయిజ: కర్నూలు జిల్లా నందవరం సమీపంలో నాగలదిన్నె వంతెన కింద ఆదివారం గుర్తు తెలియని యువకుడి మృతదేహం ఏపీ పోలీసులు గుర్తించారని ఎస్‌ఐ నరేష్‌కుమార్ తెలిపారు. 25 నుంచి 30 ఏళ్ల వయసు ఉంటుందని.. కుడి చేతికి ఎర్రదారం, నారింజరంగు బ్యాండ్‌పై జై బజరంగి అని ఉందని వివరించారు. ఎడమ చేతికి కడియం, గొంతుకు ఎర్ర దారానికి ఆంజనేయస్వామి బిళ్ల ఉందన్నారు. పూర్తి వివరాలకు ఎమ్మిగనూరు రూరల్ సీఐ (సెల్‌ఫోన్ నంబర్ 91211 01146), నందవరం ఎస్‌ఐ (సెల్‌ఫోన్ నంబర్ 91211 01150) సంప్రదించాలని కోరారు.

రెండు పాడి గేదెలు చోరీ

మరికల్: మండలంలోని మాధవరం శివారు వ్యవసాయ పొలంలో కట్టేసిన రెండు పాడి గేదెలను శనివారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు కొట్టుకెళ్లారు. గ్రామస్తుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన రైతు వెంకటేష్ తన రెండు పాడి గేదెలను రోజువారీ లాగే శనివారం రాత్రి పొలం దగ్గర కట్టేసి ఇంటికి వచ్చాడు. ఆదివారం తెల్లవారుజామున వెళ్లి చూడగా కనిపించకపోవడంతో చుట్టుపక్కల వెదికినా లాభం లేకపోయింది. రూ.1.50 లక్షల విలువ ఉంటుందని.. పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు బాధిత రైతు వివరించారు.

తప్పిపోయిన బాలుడి అప్పగింత

మరికల్: చిన్నచింతకుంట మండలం పర్ధీపూర్ గ్రామానికి చెందిన లక్ష్మి, తన ఇద్దరు పిల్లలతో ఆదివారం మరికల్‌లోని తల్లిదండ్రుల వద్దకు వచ్చింది. మరికల్‌కు వచ్చిన గంటలోపే పెద్ద కుమారుడు తేజ్(3) కనిపించకుండా పోయాడు. చుట్టుపక్కల ఎంత వెతికినా ఫలితం లేకపోయింది. రాయిచూర్ రోడ్డు ఎస్‌బీఐ బ్యాంకు పక్కన రోదిస్తూ కనిపించిన బాలుడిని పోలీసులు గుర్తించి పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లారు. గ్రామస్తుల ద్వారా ఆరా తీసి, బాలుడి కోసం వెతుకుతున్న తల్లిదండ్రులను పోలీసులు పిలిపించి అప్పగించారు. ఏఎస్‌ఐ శంకరయ్య, తిరుపతిరెడ్డి, రమేష్, లక్ష్మారెడ్డి ఉన్నారు.



ధాన్యం లోడుతో వెళ్తున్న డీసీఎం బోల్తా

జడ్చర్ల: ధాన్యం లోడుతో వెళ్తున్న డీసీఎం ముందు వెళ్తున్న రెండు కార్లను ఢీకొట్టి బోల్తా పడిన సంఘటన బాదేపల్లి సమీపంలో జాతీయ రహదారిపై చోటు చేసుకుంది. ఆదివారం ధాన్యం బస్తాలతో జడ్చర్ల వైపు వస్తున్న డీసీఎం అతి వేగం వచ్చి ముందు వెళ్తున్న రెండు కార్లను ఢీకొట్టింది. డ్రైవర్ హరికి గాయాలు కావడంతో స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రమాద సమయంలో డ్రైవర్ మద్యం మత్తులో ఉన్నట్లు తెలిసింది. కాగా ముందు వెళ్తున్న కార్లకు సంబంధించి ఎవరికి ఎలాంటి ప్రమాదం జరగలేదని స్థానికులు చెప్పారు.

యువతి అదృశ్యం

మహమ్మదాబాద్: ఓ యువతి అదృశ్యమైన ఘటనిది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని ఓ గ్రామానికి చెందిన యువతి శనివారం రాత్రి 9గంటల సమయంలో పెరుగు తీసుకువస్తానని చెప్పి దుకాణానికి వెళ్లి తిరిగి రాలేదు. దీంతో ఆమె తల్లిదండ్రులు గ్రామంలో బంధువుల ఇళ్ల వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో ఆమె తల్లి ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ సైదయ్య తెలిపారు.

వ్యక్తికి గాయాలు

మానవపాడు: జాతీయ రహదారి-44పై బైక్ అదుపు తప్పి బ్రిడ్జి పక్కన ఉన్న డివైడర్‌ను ఢీ కొని వ్యక్తికి గాయాలైన ఘటన ఆదివారం చోటుచేసుకున్నది. స్థానికుల వివరాల ప్రకారం హైదరాబాద్ నుంచి కర్నూల్ వైపుకు గుర్తుతెలియని వ్యక్తి బైక్‌పై వెళ్తుండగా బోరవెల్లి, మానవపాడు స్టేజీ మధ్యలో వాగుపై ఉన్న బ్రిడ్జి సమీపంలోని బైక్ అదుపు తప్పింది. బైక్‌పై ఉన్న వ్యక్తి గాయాలు కావడంతో వెంటనే హైవే అంబులెన్స్‌లో కర్నూల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

వీఆర్‌ఏ బలవన్మరణం



బండలయ్య (ఫైల్)

ఆత్మకూర్: జీవితంపై విరక్తి చెందిన ఓ వీఆర్‌ఏ ఉరేసుకుని బలవన్మరణానికి పాల్పడిన సంఘటన మండలంలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ మహ్మద్ అంజద్ కథనం ప్రకారం.. మండలంలోని మోట్లంపల్లికి చెందిన బండలయ్య(48) వీఆర్‌ఏగా పనిచేస్తున్నాడు. అయితే మద్యానికి బానిసైన ఆయన తరచుగా భార్యతో గొడవ పడుతుండేవాడు. ఈ క్రమంలోనే శనివారం రాత్రి తాగిన మత్తులో ఇంట్లో ఉరివేసుకుని మృతిచెందాడు. ఈ ఘటనపై భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు. తహసీల్దార్ సింధూజ దహన సంస్కారాల నిమిత్తం రూ.10 వేలు, వీఆర్‌ఏ జేఏసీ ఆధ్వర్యంలో రూ.5 వేలు ఆర్థిక సహాయం అందజేశారు.

ఊర్కొండపేటలో..

ఊర్కొండ: పురుగు మందుతాగి ఓ వివాహిత ఆత్మహత్యకు పాల్పడింది. వివరాలిలా.. ఊర్కొండపేటకు చెందిన కప్పెర మంజుల(28) ఆదివారం పురుగు మందు తాగి అపస్మారక స్థితికి చేరింది. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం కల్వకుర్తి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ మృతిచెంది. ఈమె ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది.

చికిత్స పొందుతూ వివాహిత మృతి

మహబూబ్‌నగర్ క్రైం: ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఓ వివాహిత ఆదివారం మృతిచెందినట్లు రూరల్ ఎస్‌ఐ వెంకటేశ్వర్లు తెలిపారు. ఆయన కథనం మేరకు.. మండలంలోని పోతన్‌పల్లికి చెందిన వెంకటేశ్వరి (22) అదే గ్రామానికి చెందిన చెన్నయ్యను ప్రేమించి పెద్దల ఒప్పందంతో 2017లో వివాహం చేసుకుంది. వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. చిన్న చిన్న విషయాలకు గొడవపడటంతో భర్త చెన్నయ్య భార్యను కొట్టేవాడు. పెద్ద మనుషులు పలుమార్లు సర్ది చెప్పారు. ఈ నెల 12న రాత్రి 9 గంటల సమయంలో ఇద్దరూ గొడవపడటంతో భర్త కొట్టాడు. దీంతో మనస్తాపానికి గురైన వెంకటేశ్వరి ఆటో ఇంజన్ ఆయిల్ తాగింది. విషయం తెలుసుకున్న ఆమె తల్లిదండ్రులు చికిత్స నిమిత్తం జిల్లా జనరల్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందింది. తల్లి మల్లీశ్వరి ఫిర్యాదు మేరకు చెన్నయ్యపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వివరించారు.

జల్లాపురంలో వృద్ధురాలు

మానవపాడు: ఉరేసుకొని ఓ వృద్ధురాలు మృతిచెందిన ఘటన ఆదివారం మండలంలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ సంతోష్ కథనం మేరకు.. మండలంలోని జల్లాపురం గ్రామానికి చెందిన బి.భాగ్యమ్మ (73) కొంతకాలంగా నడుము, మోకాళ్ల నొప్పులతో బాధపడుతుండేది. బాధ భరించలేక ఆదివారం ఉదయం 11.30 ప్రాంతంలో రేకుల కొట్టంలో చీరతో ఉరేసుకొని మృతి చెందింది. పెద్ద కుమారుడు పెద్ద మద్దిలేటి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ వివరించారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం

- మరొకరికి తీవ్రగాయాలు
- పెళ్లి పనుల్లో ఉండగా కబళించిన మృత్యువు

అడ్డాకుల: వారం రోజుల్లో పెళ్లి.. ఒకదిక్కు పత్రికలు పంచుతూనే.. కావాల్సిన షాపింగ్ సైతం పూర్తి చేసుకున్నాడు. ఈ క్రమంలో హైదరాబాద్‌లో పనులు ముగించుకుని సొంతూరుకు ద్విచక్రవాహనంపై బయలుదేరిన ఓ యువకుడు రోడ్డు ప్రమాదంలో దుర్మరణం పాలయ్యాడు. ఈ ఘటనకు సంబంధించి అడ్డాకుల ఎస్‌ఐ మాధవరెడ్డి కథనం ప్రకారం.. ఆంధ్రప్రదేశ్‌లోని నంద్యాల జిల్లాకేంద్రానికి చెందిన మస్తాన్‌బాషా(27) హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పనిచేస్తున్నాడు. ఈ నెల 21న పెళ్లి జరగాల్సి ఉంది. ఈ క్రమంలో హైదరాబాద్‌కు వెళ్లి స్నేహితులకు తన పెళ్లి పత్రికలను అందజేసి.. షాపింగ్ కూడా పూర్తి చేసుకున్నాడు. అనంతరం ద్విచక్రవాహనంపై స్నేహితుడు రమేష్‌బాబుతో కలిసి ఆదివారం తెల్లవారుజామున హైదరాబాద్ నుంచి నంద్యాలకు బయలుదేరాడు. మార్గమధ్యలో వీరు ప్రయాణిస్తున్న బైక్‌ను శాఖాపూర్ వద్ద గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన మస్తాన్‌బాషా అక్కడికక్కడే దుర్మరణం పాలవగా.. వెనకాల కూర్చున్న రమేష్‌బాబుకు తీవ్రగాయాలయ్యాయి. క్షతగాత్రుడిని పోలీసులు మహబూబ్‌నగర్ జనరల్ ఆస్పత్రికి, మస్తాన్ మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. ఈ ఘటనపై మస్తాన్‌బాషా తండ్రి అబ్దుల్ రహమాన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ట్రాక్టర్ ఢీకొని మరొకరు..



రామస్వామి (ఫైల్)

ఊర్కొండ: మండల కేంద్రంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతిచెందినట్లు ఎస్‌ఐ నరేశ్ తెలిపారు. ఎస్‌ఐ కథనం ప్రకారం.. ఊర్కొండకు చెందిన కొమ్ము రామస్వామి(28) స్టేజీ నుంచి గ్రామంలోకి బైక్‌పై వస్తుండగా పోలీస్‌స్టేషన్ సమీపంలో ఎదురుగా వచ్చిన ట్రాక్టర్ ఢీకొనడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ ఘటనపై కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

మక్తల్‌లో..

మక్తల్: రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతిచెందిన ఘటన పట్టణ సమీపంలోని చందాపూర్ వద్ద ఆదివారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. పట్టణంలోని మైనార్టీకాలనీకి చెందిన ఇసాక్ (25) శక్తినగర్‌లో మాంసం దుకాణం నిర్వహిస్తుండేవాడు. రోజులాగే ఆదివారం బైక్‌పై శక్తినగర్‌కు వెళ్తుండగా చందాపూర్ దగ్గర కుక్క అడ్డు రావడంతో కిందపడి అక్కడికక్కడే మృతిచెందాడు.

ఆటో బోల్తా.. ఆరుగురికి గాయాలు



ఘటన స్థలంలో ఆటో

బల్మూర్: ఆటో అదుపుతప్పి బోల్తాపడి ఆరుగురు గాయాల పాలైన ఘటన ఆదివారం సాయంత్రం మండలంలోని ఒంటిమామిడి వద్ద చోటు చేసుకుంది. ప్రత్యక్షుల కథనం మేరకు.. అచ్చంపేట మండలం మన్నెవారిపల్లికి చెందిన సోమ్లానాయక్ కుటుంబంతో కలిసి ఆటోలో పెద్దకొత్తపల్లి మండలం నాయినోనిపల్లి మైసమ్మ ఆలయానికి వెళ్లారు. దర్శనానంతరం తిరిగి వస్తుండగా రాంనగర్‌శివారులోని ఒంటిమామిడి మలుపు వద్ద ఆటో అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో చిన్నారి తనుశ్రీ తలకు గాయం కాగా.. మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాద్ నీలోఫర్ ఆస్పత్రికి తరలించారు. సోమ్లానాయక్, సుజాత, పవన్‌తో పాటు మరో ఇద్దరికి గాయాలుకాగా అచ్చంపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. ఈ ఘటనపై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

అర్ధరాత్రి ఇసుక రవాణా



మద్దూర్‌లోని వ్యవసాయ పొలంలో నిల్వ చేసిన ఇసుక

- అనుమతులు లేకుండా యథేచ్ఛగా తరలింపు
- నేరుగా వాగులోకి రోడ్డు మార్గం

చిన్నచింతకుంట: మండలంలోని వివిధ గ్రామాలలో ఇసుక అక్రమ రవాణా జోరుగా కొనసాగుతుంది. మండలంలో 12 కిలో మీటర్ల మేర పెద్దవాగు, 8 కిలో మీటర్ల మేర చిన్నవాగు ప్రవహిస్తుంది. దీంతో వాగు పరిసర ప్రాంతాల గ్రామాలకు తాగు, సాగు నీరు పుష్కలంగా అందుతుంది. వాగులో సమృద్ధిగా ఇసుక ఉండడంతో పరిసర ప్రాంతాలకు చెందిన కొందరు అక్రమార్కులు అనుమతి లేకుండా ఇసుక తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ఇసుకను తరలిస్తే భూగర్భ జలాలు అడగంటి, పరిసర ప్రాంతాల ప్రజలకు తాగు, సాగు నీటికి ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉందని ప్రజలు ఆవేదన చెందుతున్నారు.

ట్రాక్టర్లు, ఎడ్ల బండ్ల ద్వారా..

మండలంలోని వివిధ గ్రామాల నుంచి అక్రమార్కులు అర్ధరాత్రి ట్రాక్టర్లు, ఎడ్ల బండ్ల ద్వారా ఇతర మండలాలకు ఇసుకను తరలిస్తున్నారు. మండల కేంద్రంతో పాటు లాల్‌కోట, సీతారాంపేట, ముచ్చింతల, మద్దూర్, అల్లిపురంలోని వాగులకు నేరుగా అక్రమార్కులు రోడ్డును ఏర్పాటు చేశారు. ట్రాక్టర్ల ద్వారా వ్యవసాయ పొలాల్లో నిల్వలు చేసి అక్కడి నుంచి టిప్పర్ల ద్వారా ఇతర జిల్లాలకు తరలిస్తున్నారు. లాల్‌కోటలోని అధికార పార్టీకి చెందిన ఓ నాయకుడి కనుసన్నల్లో గ్రామానికి చెందిన ట్రాక్టర్ల యజమానులు నర్వ, మరికల్ మండలాలకు ఇసుక తరలిస్తున్నట్లు గ్రామస్తులు తెలుపుతున్నారు. మండలంలోని అల్లిపురం, మద్దూర్ వాగు నుంచి ఆత్మకూర్, అమరచింత, నర్వ మండలాలకు చెందిన వారు దాదాపు 200 వరకు ఎడ్లబండ్ల ద్వారా ప్రతి రోజు రాత్రి ఇసుకను తరలించి పొలాల్లో నిల్వ చేస్తున్నారు. మూడు ఎడ్ల బండ్ల ఇసుక ఒక ట్రాక్టరుకు నిండుతుంది. ఒక ఎడ్ల బండికి రూ.500 చొప్పున చెల్లించి ట్రాక్టర్ రూ.5వేల చొప్పున విక్రయిస్తున్నారు. ఎడ్ల బండ్ల వారితో బండికి రూ.200చొప్పున గ్రామస్తులు వసూలు చేస్తున్నారని, ఈ వ్యవహారం అధికారులకు తెలిసినా పట్టించుకోవడం లేదని ప్రజలు మండిపడుతున్నారు.



మద్దూర్‌లోని వ్యవసాయ పొలంలో ఎడ్ల బండిలో తెచ్చి ఉంచిన ఇసుక

అడ్డుకోవాలి..



అధికారుల పట్టించుకోకపోవడంతోనే గ్రామాలలో ఇసుక అక్రమ రవాణా కొనసాగుతుంది. అధికార పార్టీ నాయకుల అండదండలతో ఇష్టానుసారంగా తరలిస్తున్నారు. పలుమార్లు అధికారులకు సమాచారం ఇచ్చినా పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా అధికారులు చర్యలు చేపట్టి ఇసుక రవాణాను అడ్డుకోవాలి.

– కుర్వ రమేష్, చిన్నచింతకుంట, గ్రామస్తుడు

నిఘా ఉంచాం..



గ్రామాలలో ఇసుక తరలింపుపై నిఘా ఉంచాం. రాత్రి వేళల్లో పెట్రోలింగ్ నిర్వహిస్తు అక్రమాలకు అడ్డుకట్ట వేస్తున్నాం. ఎవరైన ఇసుక అక్రమంగా తరలిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటాం. గ్రామాలలో ఇసుక అక్రమంగా తరలిస్తే సమాచారం ఇవ్వాలని అవగాహన కల్పిస్తున్నాం.

– మోహన్‌బాబు, ఎస్‌ఐ, చిన్నచింతకుంట

చర్యలు చేపడుతాం..



గ్రామాలలో అభివృద్ధి పనులకు మాత్రమే ఇసుక తరలించేందుకు అనుమతులు ఇస్తున్నాం. ఎక్కడ ఇసుక అక్రమ రవాణా కొనసాగకుండా నిఘా ఉంచాలని వీఆర్‌ఏలకు, సిబ్బందికి ఆదేశించాం. సమాచారం మా దృష్టికి వస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటాం.

– సువర్ణరాజు, తహసీల్దార్, చిన్నచింతకుంట



ప్రమాదంలో నుజ్జునుజ్జయిన ఆటో.. సహాయక చర్యల్లో పోలీసులు

దూసుకొచ్చిన మృత్యువు

- మరో ఆరుగురికి గాయాలు
- కాకినాడ జిల్లాలో అతివేగంగా ఆటోను ఢీకొన్న బస్సు

తాళ్లరేవు: కాకినాడ జిల్లా తాళ్లరేవు మండలంలో ఆదివారం జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఏడుగురు మహిళలు దుర్మరణం పాలయ్యారు. మరో ఆరుగురు గాయపడ్డారు. వీరిలో తీవ్రంగా గాయపడిన నలుగురు కాకినాడ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. కోరంగి పోలీసులు, ప్రత్యక్ష సాక్షుల కథనం ప్రకారం.. కేంద్రపాలిత ప్రాంతమైన పుదుచ్చేరి పరిధిలోని యానాం పరిసర ప్రాంతాలకు చెందిన 13 మంది మహిళలు తాళ్లరేవు మండలం కోరంగి పంచాయతీ పరిధిలోని ఎపెక్స్ రొయ్యల ప్రాసెసింగ్ యూనిట్‌లో పనిచేసేందుకు ఉదయం ఆటోలో వెళ్లారు. ఉదయం షిఫ్ట్ పని పూర్తిచేసుకుని మధ్యాహ్నం రెండుగంటల సమయంలో తిరిగి అదే ఆటోలో ఇళ్లకు బయలుదేరారు. ఆటో బయలుదేరిన పదినిమిషాల్లోనే.. మరో 20 నిమిషాల్లో ఇళ్లకు చేరుకుంటారనగా ప్రమాదానికి గురయ్యారు. ఎపెక్స్ కంపెనీ నుంచి సుమారు 200 మీటర్ల దూరంలో ఉన్న సుబ్బారాయుని దిబ్బ వద్ద వీరు ప్రయాణిస్తున్న ఆటోను ఎదురుగా వస్తున్న మోజో ట్రావెల్స్ బస్సు బలంగా ఢీకొంది. అత్యంత వేగంగా ఆటోను ఢీకొన్న బస్సు పక్కనున్న రైలింగ్‌ను ఢీకొని ఆటోను సుమారు 20 మీటర్ల మేర ఈడ్చుకుపోయింది. బస్సు ఢీకొన్న తాకిడికి ఆటో నుజ్జునుజ్జయింది. ఆటోలో ప్రయాణిస్తున్న ఆరుగురు మహిళలు అక్కడికక్కడే దుర్మరణం పాలయ్యారు. కాకినాడ జీజీహెచ్‌లో చికిత్స పొందుతూ మరో మహిళ మృతి చెందింది. యానాం ఫరంపేటకు చెందిన ఆటోడ్రైవర్ గిడ్డి వెంకటేశ్వరరావు ప్రమాదాన్ని ముందే గుర్తించి ఆటోలో నుంచి దూకేసి ప్రాణాలు దక్కించుకున్నాడు.

ఇచ్చిపుచ్చుకున్నారు..

అమరావతి కేంద్రంగా చంద్రబాబు క్విడ్ ప్రోకో గుట్టురట్టు


సాక్షి, అమరావతి: కృష్ణా నది కరకట్టపై చంద్రబాబు నివాసం.. అమరావతిలో చంద్రబాబు క్విడ్ ప్రో కోకు ఓ మచ్చు తునకని నిగ్గు తేలింది. అమరావతిలోని సీడ్ క్యాపిటల్‌లో నారాయణ బినామీల పేరిట ఉన్న 75,888 చదరపు గజాల స్థలాలు టీడీపీ భూబాగోతానికి నిదర్శనమని నిర్ధారణ అయ్యింది. ఇన్నర్ రింగ్ రోడ్డు అలైన్‌మెంట్‌లో టీడీపీ పెద్దల అవినీతి బట్టబయలైంది. అమరావతి మాస్టర్ ప్లాన్ రూపకల్పనలోనే చంద్రబాబు, నారాయణ, లింగమనేని, వారి బంధువులు, బినామీలు భారీ భూ దోపిడీకి బరితెగించారని ఆధారాలతో సహా వెల్లడైంది. చంద్రబాబు అండ్ గ్యాంగ్ అమరావతిలోని అవినీతి సామ్రాజ్యాన్ని సీఐడీకి చెందిన ప్రత్యేక దర్యాప్తు బృందం(సిట్) బట్టబయలు చేసింది. దాంతో టీడీపీ ప్రభుత్వంలో అమరావతి కేంద్ర బిందువుగా ఏ–1 నారా చంద్రబాబు, ఏ–2 పొంగూరు నారాయణ యథేచ్ఛగా సాగించిన భారీ భూ దోపిడీపై ప్రభుత్వం కొరడా ఝుళిపించింది. అమరావతిలో చంద్రబాబు ప్రభుత్వం పాల్పడిన అక్రమాలు, అవినీతిపై దర్యాప్తునకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దర్యాప్తు బృందం(సిట్)ను నియమించడం సరైనదేనని ఇటీవల సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. దాంతో తన అవినీతి బట్టబయలు కాకుండా బాబు కొన్నేళ్లుగా అడ్డుకుంటున్న కుట్రలకు తెరపడింది. ఈ నేపథ్యంలో రాజధాని ల్యాండ్ పూలింగ్, సీడ్ క్యాపిటల్ మాస్టర్ ప్లాన్, ఇన్నర్ రింగ్ రోడ్డు అలైన్‌మెంట్‌లలో పచ్చ ముఠా అక్రమాలపై ప్రభుత్వం కఠిన చర్యలకు ఉపక్రమించింది.

■ బాబు, నారాయణవి అక్రమ ఆస్తులే

అక్రమ మార్గంలో సంపాదించిన ఆస్తులను అటాచ్ చేసేందుకు ప్రభుత్వానికి అధికారం కల్పిస్తున్న క్రిమినల్ లా ఆర్డినెన్స్ ప్రకారం అనుమతించాలని సీఐడీ కోరింది. ఈ మేరకు అవినీతి నిరోధక చట్టం –1988 ప్రకారం లింగమనేని కుటుంబం క్విడ్ ప్రో కో కింద చంద్రబాబుకు ఇచ్చిన కరకట్ట నివాసం.. సీడ్ క్యాపిటల్ ప్రాంతంలో నారాయణ బినామీల పేరిట పొందిన 75,888 చదరపు గజాల స్థలాలను అటాచ్ చేసేందుకుసీఐడీకి అనుమతిస్తూ హోమ్ శాఖ రెండు వేర్వేరు జీవోలు జారీ చేసింది. దాంతో సీఐడీ ఆ విషయాన్ని ఏసీబీ న్యాయస్థానానికి నివేదించి, ఆ ఆస్తులను అటాచ్ చేసేందుకు ఉపక్రమించనుంది. తదుపరి దశల్లో మరిన్ని కఠిన చర్యలు చేపట్టేందుకు సన్నాహాలు వేగవంతం చేస్తోంది.

■ భారీ అవినీతికే 'మాస్టర్ ప్లాన్'

అమరావతి మాస్టర్ ప్లాన్ రూపకల్పనలోనే ఏ–1 బాబు, ఏ–2 నారాయణ భారీ అవినీతికి పునాది వేశారు. కేంద్ర ప్రభుత్వ అనుమతి లేకుండానే అప్పటి టీడీపీ ప్రభుత్వం, సింగపూర్‌కు చెందిన ఇంటర్నేషనల్ ఎంటర్‌ప్రైజెస్‌తో ఒప్పందం చేసుకుంది. అమరావతి మాస్టర్ ప్లాన్ రూపకల్పనకు కన్సల్టెన్సీ ఎంపిక కోసం కనీసం టెండర్ల ప్రక్రియ కూడా చేపట్టకుండా సింగపూర్ కంపెనీకి నామినేషన్ పద్ధతిలో అడ్డగోలుగా అప్పగించేశారు. దాంతో చంద్రబాబు, నారాయణ కనుసన్నల్లోనే మాస్టర్ ప్లాన్‌ను సింగపూర్ కంపెనీ రూపొందించింది. లింగమనేని రమేశ్, లింగమనేని రాజశేఖర్, హెరిటేజ్ ఫుడ్స్, చంద్రబాబు బినామీలకు చెందిన భూములు ల్యాండ్ పూలింగ్ పరిధిలోకి రాకుండా.. వారి భూముల వెలుపలి నుంచే ల్యాండ్ పూలింగ్ చేసేలా మాస్టర్ ప్లాన్‌ను ఖరారు చేశారు. అందుకు ప్రతిగా చంద్రబాబు కుటుంబానికి లింగమనేని కుటుంబం భారీగా ప్రతిఫలాన్ని ముట్టజెప్పింది.



అమరావతి ఇన్నర్ రింగ్ రోడ్డు అలైన్మెంట్‌లో అక్రమాలను నిరూపిస్తున్న మ్యాప్

■ క్విడ్ ప్రోకో కిందే కరకట్ట నివాసం

చంద్రబాబు, లింగమనేని క్విడ్ ప్రో కో కింద పరస్పరం భారీగా అవినీతికి పాల్పడినట్టు సిట్ నిర్ధారించింది. లింగమనేని కుటుంబ సభ్యుల భూములు ల్యాండ్ పూలింగ్ పరిధిలోకి రాకుండా చేసినందుకు బాబుకు భారీగా ముట్టజెప్పారు. ఇన్నర్ రింగ్ రోడ్డుకు ఆనుకుని ఉన్న భూములను హెరిటేజ్ ఫుడ్స్‌కు 'అమ్మినట్టు' ఇవ్వడంతో సరిపెట్టలేదు. లింగమనేని కృష్ణానది కరకట్ట మీద ఉన్న నివాసాన్ని కూడా బాబుకు ఇవ్వడం గమనార్హం. పక్కా క్విడ్ ప్రో కోలో భాగంగానే కరకట్ట నివాసం బాబుకు ఉచితంగా ఇచ్చేశారని సీఐడీ దర్యాప్తులో వెల్లడైంది.

■ కరకట్ట నివాసంపై బాబు కట్టుకథలు

కరకట్ట నివాసంపై న్యాయస్థానాన్ని, ప్రజల్ని తప్పుదారి పట్టించేందుకు చంద్రబాబు చేసిన ప్రయత్నాలు బెడిసికొట్టాయి. ముఖ్యమంత్రి హోదాలో చంద్రబాబు జీతంతోపాటు హౌస్ రెంట్ అలవెన్స్ (ఇంటి అద్దె అలవెన్స్) కూడా తీసుకున్నారు. అంటే ప్రజాధనం నుంచి సీఎంగా ఇంటి అద్దె అలవెన్స్ తీసుకున్నారు. కానీ చంద్రబాబు 2017 నుంచి తాను ఉంటున్న కరకట్ట నివాసానికి అద్దెను లింగమనేని కుటుంబానికి చెల్లించినట్టు ఎక్కడా బ్యాంకు లావాదేవీలు లేవు. చంద్రబాబు నుంచి తీసుకున్న అద్దెకు లింగమనేని ఎక్కడా జీఎస్టీ చెల్లించనే లేదు. అంటే ఇంటి అద్దె అలవెన్స్‌ను ప్రజాధనం నుంచి తీసుకుంటున్న చంద్రబాబు.. తాను నివసిస్తున్న ఇంటికి మాత్రం అద్దె చెల్లించడమే లేదన్నది నిర్ధారణ అయ్యింది. క్విడ్ ప్రో కోలో భాగంగా ఆ నివాసం చంద్రబాబుకు లింగమనేని ఇచ్చారు కాబట్టే అద్దె చెల్లించలేదు.

■ దేశ భక్తితో ఇచ్చారట!

కరకట్ట నివాసంపై న్యాయస్థానాన్ని తప్పుదోవ పట్టించేందుకు లింగమనేని కూడా యత్నించారు. తాను దేశభక్తితోనే కరకట్ట నివాసాన్ని అప్పటి ప్రభుత్వం వాడుకునేందుకు ఉచితంగా ఇచ్చానని లింగమనేని రమేశ్ న్యాయస్థానానికి ఇచ్చిన వాంగ్మూలంలో పేర్కొన్నారు. మరి ఉచితంగా ఇచ్చిన ఇంటికి చంద్రబాబు ప్రజాధనం నుంచి ఇంటి అద్దె అలవెన్స్‌ను ఎలా తీసుకున్నారన్న ప్రశ్నకు సమాధానమే లేదు. దేశభక్తితో ఉచితంగా ఇస్తే రాష్ట్ర ప్రభుత్వానికి ఇవ్వాలి గానీ చంద్రబాబుకు వ్యక్తిగతంగా ఇవ్వడం ఏమిటి? ప్రభుత్వానికే ఉచితంగా ఇచ్చి ఉంటే.. చంద్రబాబు సీఎం పదవి నుంచి దిగిపోగానే ఆ ఇంటిని ఖాళీ చేయాలి. ఆ ఇంటిని ప్రభుత్వానికి అప్పగించాలి. ముఖ్యమంత్రి పదవి నుంచి వైదొలగిన తర్వాత ప్రభుత్వ ఆధ్వర్యంలోని ముఖ్యమంత్రి క్యాంప్ కార్యాలయాన్ని ఖాళీ చేయాలి. ఆ నివాసం ప్రభుత్వానికి చెందుతుంది. కానీ 2019లో సీఎం పదవి నుంచి దిగిపోయిన తర్వాత కూడా చంద్రబాబు అదే కరకట్ట నివాసంలో ఉంటున్నారు. అంటే లింగమనేని దేశ భక్తితో ప్రభుత్వానికి ఉచితంగా ఇచ్చారన్నది అవాస్తవం. క్విడ్ ప్రో కోలో భాగంగానే ఆయన చంద్రబాబుకు ఇచ్చారన్నది దీనినిబట్టి కూడా నిర్ధారణ అయ్యింది.

■ లింగమనేని నుంచి హెరిటేజ్ ఫుడ్స్‌కు భూమి

2014లో లింగమనేని కుటుంబ సభ్యుల నుంచి హెరిటేజ్ ఫుడ్స్ 4 ఎకరాలను 'కొనుగోలు చేసినట్టు' చూపించడం గమనార్హం. అమరావతి ల్యాండ్ పూలింగ్ పరిధిలోకి రాకుండా ఇన్నర్ రింగ్ రోడ్డును ఆనుకుని ఉన్న భూమినే హెరిటేజ్ ఫుడ్స్ కొనుగోలు చేసింది. ఆ పేరుతో ఆ భూమిని హెరిటేజ్ ఫుడ్స్‌కు బదలాయించారు. ఆ మేరకు అప్పట్లోనే నారా లోకేశ్ డైరెక్టర్‌గా ఉన్న హెరిటేజ్ ఫుడ్స్ బోర్డ్ ఆఫ్ డైరెక్టర్ల సమావేశంలో తీర్మానం చేశారు. అనంతరం ఎమ్మెల్సీగా ఎన్నికై, మంత్రి కూడా అయిన లోకేశ్ అదే లింగమేని కుటుంబం ఇచ్చిన కరకట్ట మీద నివాసంలోనే నివసించారు.

సీడ్ క్యాపిటల్‌లో వేళ్లూనుకున్న అవినీతి

- అమరావతిలో అత్యంత ప్రధానమైన సీడ్ క్యాపిటల్‌లో కూడా ఏ–1 చంద్రబాబు, ఏ–2 నారాయణ భారీగా భూ అక్రమాలకు పాల్పడ్డారు. ఎందుకంటే శాసనసభ, సచివాలయం మొదలైన ప్రధాన విభాగాలన్నీ కూడా సీడ్ క్యాపిటల్ పరిధిలోనే నిర్మించాలని నిర్ణయించారు.
- ఆ ప్రాంతంలో భూముల ధరలు భారీగా పెరుగుతాయి కాబట్టి, సీడ్ క్యాపిటల్‌లో పూర్తిగా తమ వాటా భూములే ఉండేట్టుగా చంద్రబాబు, నారాయణ పన్నాగం పన్నారు. సింగపూర్ కంపెనీ సీడ్ క్యాపిటల్ మాస్టర్ ప్లాన్‌ను ప్రభుత్వానికి 2015 జూలైలోనే సమర్పించింది. కానీ ఆ ప్లాన్‌ను బహిర్గతం చేయకుండా, ఆమోదించకుండా మూడు నెలలపాటు కాల యాపన చేశారు.
- ఆ సమయంలోనే నారాయణ తమ బినామీలు, బంధువులైన పొత్తూరి ప్రమీల, రాపూరి సాంబశివరావు, ఆవుల ముని శంకర్, వరుణ్ కుమార్ కొత్తప్ప పేరున సీడ్ క్యాపిటల్ ప్రాంతంలో 65.50 ఎకరాలు కొనుగోలు చేశారు. అందుకోసం నారాయణ భార్య రమాదేవి, అల్లుడు డైరెక్టర్లుగా ఏర్పాటు చేసిన ఎన్‌స్పైరా కంపెనీ నుంచి నిధులను తమ బంధువులు, బినామీల ఖాతాల్లోకి మళ్లించారు. వారి పేరున సీడ్ క్యాపిటల్ ప్రాంతంలో భూములు కొనుగోలు చేశారు.
- రామకృష్ణ హౌసింగ్ ప్రైవేట్ లిమిటెడ్ పేరును బినామీగా పెట్టుకుని కూడా నారాయణ సీడ్ క్యాపిటల్ ప్రాంతంలో భూములు కొనుగోలు చేశారు. నారాయణ కుటుంబ సభ్యుల బ్యాంకు ఖాతాల నుంచి రామకృష్ణ హౌసింగ్ ప్రైవేట్ లిమిటెడ్ బ్యాంకు ఖాతాకు నిధులు బదిలీ చేశారు. ఆ నిధులతో ఆ కంపెనీ ఉద్యోగుల పేరున భూములు కొనుగోలు చేశారు.
- కేసు దర్యాప్తులో భాగంగా ఆ ఉద్యోగులను సిట్ అధికారులు ప్రశ్నించగా తాము నారాయణ బినామీలుగానే భూములు కొనుగోలు చేశామని వాంగ్మూలం ఇవ్వడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఇలా నారాయణ తమ బంధువులు, బినామీల పేరిట సీడ్ క్యాపిటల్ ప్రాంతంలో కొనుగోలు చేసిన 65.50 ఎకరాలను ల్యాండ్ పూలింగ్ కింద సీఆర్డీఏకు ఇచ్చారు.
- అందుకు ప్రతిగా ల్యాండ్ పూలింగ్ ప్యాకేజీ కింద సీడ్ క్యాపిటల్ ప్రాంతంలో అత్యంత విలువైన 75,888 చదరపు గజాల స్థలాలు పొందారు. వాటిలో 7,620 చదరపు గజాలు, 8,880 చదరపు గజాలు, 6,550 చదరపు గజాలు, 25 వేల చదరపు గజాల స్థలాలు కూడా ఉన్నాయి. అవి నేరుగా సీడ్ యాక్సెస్ రోడ్డుకు అనుసంధానించి ఉండటం గమనార్హం.
- భవిష్యత్‌లో స్టార్ హోటళ్లు, షాపింగ్ మాల్స్, ఇతర భారీ వాణిజ్య సముదాయాల నిర్మాణానికి అనుకూలమైన విలువైన స్థలాలను పొందారన్నది స్పష్టమవుతోంది. పూలింగ్ ప్యాకేజీ కింద ఏటా సీఆర్డీఏ ఇప్పటివరకు చెల్లించిన రూ. 1.92 కోట్ల కౌలు మొత్తం ఎన్‌స్పైరా ఖాతాల్లో జమచేస్తున్నారు. అంటే ఆ భూములు కొను గోలు చేసి సీఆర్డీఏకే ఇచ్చినట్టు పేర్కొన్న పొత్తూరి ప్రమీల, రాపూరి సాంబశివరావు, ఆవుల ముని శంకర్, వరుణ్‌కుమార్ కొత్తప్ప పూర్తిగా నారాయణ బినామీలేనన్నది నిర్ధారణ అయ్యింది.

వారి భూముల వద్దే ఇన్నర్ రింగ్ రోడ్డు

- అమరావతిలో 75 మీటర్ల ఇన్నర్ రింగ్ రోడ్డు అలైన్‌మెంట్‌ను రూపొందించడంలో చంద్రబాబు, నారాయణ యథేచ్ఛగా అక్రమాలకు పాల్పడ్డారు. వారి భూములను ఆనుకునే ఇన్నర్ రింగ్ రోడ్డు నిర్మించేలా అలైన్‌మెంట్‌ను రూపొందించారు. లింగమనేని కుటుంబం, హెరిటేజ్ ఫుడ్స్, నారాయణ విద్యా సంస్థల సమీపం నుంచి ఇన్నర్ రింగ్ రోడ్డు నిర్మించేలా చంద్రబాబు, నారాయణ ప్రత్యేకంగా పర్యవేక్షించారు. తమ భూముల నుంచి కాకుండా సామాన్య రైతుల భూముల నుంచి ఇన్నర్ రింగ్ రోడ్డు నిర్మించేలా అలైన్‌మెంట్‌ను ఖరారు చేయడం గమనార్హం. అందుకోసం ముందుగానే ఆ భూముల్లో రియల్ ఎస్టేట్ వెంచర్లు, ఇళ్ల నిర్మాణాలకు కూడా అనుమతి ఇవ్వకుండా సీఆర్డీయే నిలుపుదల చేసింది. అంటే కన్సల్టెన్సీ సంస్థ అలైన్‌మెంట్‌ను రూపొందించకముందే చంద్రబాబు, నారాయణ ఇన్నర్ రింగ్ రోడ్డు ఎలా నిర్మించాలో నిర్ణయించేశారు. అప్పటికే నిర్ణయించిన అలైన్‌మెంట్‌ను ఖరారు చేసేందుకే ఓ కన్సల్టెన్సీని నియమించి కనికట్టు చేశారు. వాస్తవానికి విజయవాడలోని కామినేని ఆస్పత్రి వద్ద ఉన్న తాడిగడప–ఎన్కేపాడు మీదుగా ఇన్నర్ రింగ్ రోడ్డు నిర్మించాలని కన్సల్టెన్సీ సంస్థ ఎస్‌టీయూపీ అలైన్‌మెంట్‌ను రూపొందించింది. అలా నిర్మిస్తే నారాయణ విద్యా సంస్థలతోపాటు హెరిటేజ్ ఫుడ్స్, లింగమనేని భూముల మీదుగా రోడ్డును నిర్మించాల్సి వస్తుంది. దీనిపై అప్పటి సీఆర్డీయే వైస్ చైర్మన్‌గా ఉన్న నారాయణ సీఆర్డీయే సమావేశంలోనే అధికారులపై తీవ్ర ఆగ్రహావేశాలు వ్యక్తం చేశారు. తాడిగడపకు 3 కి.మీ. దూరంగా తూర్పు వైపు నుంచి పెనమలూరు– నిడమనూరు మీదుగా ఇన్నర్‌రింగ్ రోడ్డు నిర్మించేలా అలైన్‌మెంట్‌ను మార్పించారు.

జూరాలకు స్వల్ప ఇన్‌ఫ్లో



ధరూరు/ దోమలపెంట: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు ఎగువ నుంచి స్వల్ప ఇన్‌ఫ్లో కొనసాతున్నట్లు పీజేపీ అధికారులు తెలిపారు. ఆదివారం సాయంత్రానికి ప్రాజెక్టుకు ఎగువ నుంచి 1,533 క్యూసెక్కుల వరద వచ్చింది. దీంతో 10 రోజుల నుంచి ప్రాజెక్టుకు దాదాపు 3 టీఎంసీల నీరు చేరినట్లయ్యింది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 9.657 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం 6.401 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఇదిలా ఉండగా ప్రాజెక్టు నుంచి 141 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు.

శ్రీశైలంలో 809.2 అడుగులు

శ్రీశైలం జలాశయంలో ఆదివారం 809.2 అడుగుల వద్ద 33.8614 టిఎంసీల నీరు నిల్వ ఉంది. గత 24 గంటల వ్యవధిలో జలాశయంలో 226 క్యూసెక్కుల నీరు ఆవిరి కాగా.. ఎగువ నుంచి 779 క్యూసెక్కుల నీరు వచ్చింది.

క్రీడాకారులకు ప్రభుత్వం చేసింది శూన్యం



మాట్లాడుతున్న ఆర్‌ఎస్ ప్రవీణ్ కుమార్

బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్

అయిజ: తెలంగాణ ప్రభుత్వం క్రీడాకారుల కోసం చేసింది ఏమిటని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షులు ఆర్‌ఎస్ ప్రవీణ్ కుమార్ ప్రశ్నించారు. ఆదివారం పట్టణంలోని కబడ్డీ క్రీడా మైదానంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడారు. క్రీడాకారులకు తెలంగాణ రాష్ట్రంలో ఎలాంటి వసతులు ఏర్పాటు చేయలేదని అన్నారు. రాష్ట్ర స్థాయి, జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులకు ప్రభుత్వం ఎలాంటి ఖర్చు పెట్టలేదని విమర్శించారు. నిధులు ఇవ్వకుండా సీఎం కప్ పేరుతో తెలంగాణ రాష్ట్రం మొత్తం క్రీడలను నిర్వహించాలని పీఈటీలను, పీడీలను పురమాయించారని అన్నారు. ఈప్రాంతంలో ప్రతిభ కలిగిన క్రీడాకారులు ఉంటే వారికి బీఎస్పీ తరపున స్టేట్ అకాడమీకి ఏదో ఒక డైట్, డ్రస్సు, షూస్ ఇస్తామని అన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల కోసం 46 స్పోర్ట్స్ అకాడమీలు పెట్టామని తెలిపారు. క్రీడాకారుల కోసం స్పోర్ట్స్ అకాడమీ కట్టలేరా అని ప్రశ్నించారు. అనంతరం స్వేరో ఎడ్యుకేషన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పట్టణంలో నిర్వహిస్తున్న కబడ్డీ, క్రికెట్ క్రీడాకారులను అభినందించారు. విద్యార్థులకు కనీస వసతులు లేవని, క్రీడా ప్రాంగణాలు, ఆట వస్తువులు లేవని అన్నారు. ప్రభుత్వం నిర్మించిన గ్రామీణ క్రీడా ప్రాంగణాలు కేవలం బోర్డులకే పరిమితమయ్యాయని అన్నారు. బంజరు భూముల్లో, పశువులు, జంతువులు తిరిగే ప్రాంతాల్లో బోర్డులు ఏర్పాటు చేశారని, కొన్నిచోట్ల శ్మశాన వాటికల్లో మరికొన్ని చోట్ల ఎత్తయిన గుట్టల్లో గ్రామీణ క్రీడా ప్రాంగణం బోర్డులు పెట్టారని విమర్శించారు. క్రీడాకారులకు కోచ్ ఉండాలని, కనీసం 5 సంవత్సరాలు సాధన చేసి ఉండాలని అన్నారు. క్రీడాకారులకు సరైన ఆహార పదార్థాలు, యూనిఫాం ఇచ్చి ఉండాలని, వారికి కోచ్‌లను ఏర్పాటు చేసి ఉండాలని అన్నారు. ఇవన్నీ లేకుండా క్రీడాపోటీలు ఎలా నిర్వహిస్తారని అన్నారు. అనంతరం క్రికెట్, కబడ్డీ విజేతలకు బహుమతులు అందజేశారు.

సామూహిక హనుమాన్ చాలీసా పారాయణం



హాజరైన భక్తులు

జడ్చర్ల టౌన్: హనుమాన్ జయంతిని పురస్కరించుకుని ఆదివారం రాత్రి స్థానిక రాజస్థాన్ ఫంక్షన్‌హాల్‌లో ధర్మజాగరణ శాఖ ఆధ్వర్యంలో సామూహిక హనుమాన్ చాలీసా పారాయణం ఘనంగా నిర్వహించారు. గంగాపురం మళయాల లక్ష్మీనారాయణ ఆశ్రమ నిర్వాహకులు శివానందస్వామి పాల్గొని మాట్లాడారు. హనుమంతుడు శ్రీరామ నామం జపిస్తూనే అనేక అద్భుతాలు సృష్టించాడని, అసాధ్యాన్ని సుసాధ్యం చేశాడని అన్నారు. హనుమంతుడు సమస్త దేవతల శక్తిని గ్రహించి సమస్త జ్ఞానాన్ని, బలాన్ని పొందేందుకు కారణం రాముడేనని అన్నారు. శ్రీరామ నామంతోపాటు హనుమాన్ చాలీసా పారాయణం వల్ల భక్తిభావం నెలకొంటుందన్నారు. ప్రతి ఇంట్లో పిల్లలకు రామాయణ, మహాభారతాన్ని చెప్పాలన్నారు. హనుమాన్ చాలీసా పారాయణంలో సంస్కృత భారతి అధ్యక్షుడు బుచ్చిలింగం, పాలమూరు ఆర్‌ఎస్‌ఎస్ విభాగ్ కార్యవహ పత్తికొండ రాములు, పట్టణంలోని 23 భక్తబృందాలు, వ్యాపారస్తులు, మహిళలు పాల్గొన్నారు.

బీచుపల్లిలో ప్రత్యేక పూజలు

ఎర్రవల్లిచౌరస్తా: ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో ప్రముఖ పుణ్యక్షేత్రమైన బీచుపల్లిలో ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఆదివారం హనుమాన్ జయంతిని పురస్కరించుకొని ఆలయ ప్రధాన అర్చకులు ఆంజనేయస్వామిని ప్రత్యేకంగా అలంకరించి అభిషేకం, ఆకుపూజ తదితర పూజలు జరిపారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు ఉదయాన్నే బీచుపల్లికి చేరుకొని పవిత్ర కృష్ణానదిలో పుణ్యస్నానాలు ఆచరించారు. అనంతరం భక్తిశ్రద్ధలతో ఆంజనేయస్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేసి.. ధ్వజస్తంభాల ముందు కొబ్బరికాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు.



ఇసుక అక్రమ రవాణాను అడ్డుకున్న గ్రామస్తులు



మిడ్జిల్: మండలంలోని చిల్వేర్– ఆవంచ గ్రామాల సరిహద్దులోని దుందుభి వాగు నుంచి శనివారం రాత్రి ఇసుక అక్రమంగా తరలించేందుకు ఓ ప్రజాప్రతినిధి భర్త, ఇతర నాయకులు టిప్పర్ తీసుకొని వచ్చారు. గుర్తించిన గ్రామస్తులు అడ్డుకొని టిప్పర్, ప్రజాప్రతినిధి కారు అద్దాలు ధ్వంసం చేశారు. దీంతో వారు అదేరాత్రి కారును తీసుకెళ్లగా గ్రామస్తులు టిప్పర్‌ను గ్రామపంచాయతీ కార్యాలయం వద్దకు తరలించారు. జడ్చర్ల, మిడ్జిల్‌కు చెందిన కొందరు నాయకులు రాత్రిళ్లు ఇసుక అక్రమ రవాణాకు పాల్పడుతున్నట్లు గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఈ ఘటనపై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్‌ఐ రాంలాల్ నాయక్ తెలిపారు.



నల్లమల ఘాట్ కాదు.. నవాబుపేట రోడ్డు

చూడటానికి నల్లమలలా కనిపిస్తున్న ఈ **అడవి నవాబుపేట మార్గంలోనిది. జిల్లాకేంద్రం నుంచి నవాబుపేటకు కూతవేటు దూరంలో ఉన్న** ఈ అడవి ఘాట్ రోడ్డు సోయగాలతో ఆకట్టుకుంటుంది. మండల కేంద్రానికి 9 కి.మీ., దూరంలో ప్రారంభమైన ఈ అడవి అటు మహమ్మదాబాద్, కుల్కచర్ల, చౌడాపూర్, హన్వాడ వరకు.. ఇటు పిల్లలమర్రి, ఏకో పార్కు వరకు వ్యాపించింది. ఇటీవల కురిసిన అకాల వర్షాలతో అడవి అంతా పచ్చదనం పరుచుకుంది. దట్టమైన అడవి మధ్యలో రోడ్డు వంపులు తిరిగి వాహనదారులను, ప్రయాణికులను విశేషంగా అలరిస్తోంది. అడవిలో వెలసిన పర్వతాపూర్ మైసమ్మ ఆలయం మరింత ప్రత్యేకం.

- నవాబుపేట

నల్లబెల్లం, పటిక స్వాధీనం

కల్వకుర్తిరూరల్: సారా తయారీకి వినియోగించే నల్లబెల్లం, పటికను స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ సీఐ శంకర్ ఆదివారం విలేకరులకు తెలిపారు. సర్కిల్ పరిధిలోని తర్నికల్‌తండాలో నల్లబెల్లం దించుతున్నారన్న విశ్వసనీయ సమాచారం మేరకు శనివారం రాత్రి 11 గంటల సమయంలో రూట్‌వాచ్ నిర్వహించామన్నారు. టాటా ఇంట్రా వాహనం నుంచి కిందకు దించుతున్న 90 బ్యాగుల (2,700 కిలోలు) నల్లబెల్లం, 6 బ్యాగుల (240 కిలోలు) పటిక పట్టుబడ్డాయని తెలిపారు. డ్రైవర్ పరారయ్యాడని.. రంగారెడ్డి జిల్లా మంచాల మండలం ఆర్మూరు తండాకు చెందిన పాండు సరఫరా చేసినట్లుగా తేలిందని వివరించారు. విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటామని సీఐ తెలిపారు. దాడుల్లో ఎస్‌ఐలు వెంకటేశ్, దిలీప్‌రెడ్డి పాల్గొన్నారు. సారా తయారుచేసినా, విక్రయించినా కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ హెచ్చరించారు.



పట్టుబడిన వాహనంతో సీఐ శంకర్, సిబ్బంది

ఇథనాల్ కంపెనీ రద్దు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

అమరచింత: మరికల్ మండలం చిత్తనూర్, కృష్ణా మండలం హిందూపూర్‌లో ఏర్పాటవుతున్న ఇథనాల్ కెమికల్ ఫ్యాక్టరీలను రద్దు చేయాలని కేఏఎన్‌పీఎస్ చైర్మన్ బండారి లక్ష్మయ్య, పాలమూరు అధ్యయన వేదిక కోకన్వీనర్ సుదర్శన్ డిమాండ్ చేశారు. పట్టణంలోని హైస్కూల్ ఆవరణంలో ఆదివారం ధర్నాకు సంబంధించిన వాల్ పోస్టర్‌ను విడుదల చేసి మాట్లాడారు. జిల్లాలో ఏర్పాటు చేస్తున్న కెమికల్ ఫ్యాక్టరీల వలన రామన్‌పాడు, జూరాల ప్రాజెక్టులతో పాటు కృష్ణానది కలుషితం అవుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మిషన్ భగీరథ పేరుతో అందిస్తున్న తాగునీళ్ల కలుషితం కావడం వల్ల ప్రజలు రోగాలబారిన పడి చనిపోయే ప్రమాదం ఉందన్నారు. కెమికల్ ఫ్యాక్టరీల ద్వారా వచ్చే వ్యర్థాలు భూమిలోకి ఇంకి భూగర్భజలాలు కలుషితం అవుతాయన్నారు. సాగు, తాగునీరు సైతం ఇథనాల్ కంపెనీల ఏర్పాటుతో నాశనమవుతాయని, వ్యవసాయానికి ఇక్కడి భూములు పనికి రాకుండా పోతాయని పేర్కొన్నారు. ఇథనాల్ ఫ్యాక్టరీలు పెద్దఎత్తున బియ్యం, గోధుమలు, మొక్కజొన్నలు, నీళ్లను వినియోగించడం ద్వారా భవిష్యత్‌లో ఆహార ధాన్యాల కొరత, నీటి కొరత ఏర్పడుతుందని అన్నారు. జీవవైవిధ్యం దెబ్బతిని వన్యప్రాణులు నశించి పర్యావరణం మొత్తం నాశనమవుతుందన్నారు. ప్రజలను నష్టపర్చడానికి ఏర్పాటు చేస్తున్న ఫ్యాక్టరీలను వెంటనే రద్దు చేయాలని 15న సోమవారం మక్తల్ లో ధర్నా నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు, యువకులు, మేధావులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో ఏఐఎస్‌ఎఫ్ జిల్లా నాయకులు నాగరాజ్, ఆర్‌ఎస్‌పీ జిల్లా నాయకులు భాస్కర్, దివ్యాంగుల సంక్షేమ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు లక్ష్మన్, స్టాలిన్, మధుతో పాటు పలువురు పాల్గొన్నారు.